Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 231 మేడ్చల్ మల్కాజ్‌గిరి 10 సెప్టెంబర్ 2023 ఆదివారం పేజీలు : 4

### రామేశ్వరం రేవు వద్ద వెనక్కి మళ్ళిన సముద్రం

చెన్నై: రామనాథపురం జిల్లా రామేశ్వరం చేపలరేవు వద్ద సముద్రం ఉన్నట్టుండి వెనక్కి మళ్లింది. సుమారు 50 మీటర్ల దాకా సముద్రం వెనక్కి మళ్లడంతో రేవు ప్రాంతమంతా పచ్చటి నాచుతో బురదమయంగా కనిపించింది. నాలుగు రోజులుగా రామేశ్వరం తీరం అంతటా పెనుగాలులు వీస్తున్నాయి. జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా రేవు వద్ద తమ పడవలను లంగరేసి ఉంచి ఇంటిపట్టునే గడుపుతున్నారు. సముద్రం వెనక్కి మళ్లడంతో కొన్ని నాటుపడవలు బురదలో చిక్కుకున్నాయి. ఇదే విధంగా ఆ చేపల రేవుకు వెళ్లే రహదారి నాలుగు రోజలపాటు కురిసిన వర్షానికి దుర్గంధభరితంగా తయారైంది.

# రైతుల కలలను సాకారం చేయనున్న

# పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల

## ప్రాజెక్టుపై సమీక్షా సమావేశంలో మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల.. ప్రజలు పడిన కష్టాలను తీర్చే గొప్ప ప్రాజెక్టు ఇది అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ నెల 16వ తేదీన నిర్వహించే పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సచివాలయంలో మంత్రి కేటీఆర్.. మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, వివిధ శాఖల అధిపతులు, పూర్వ జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ఒకనాడు వలసలతో పడావుపడ్డ పాలమూరు జిల్లాను పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పచ్చగా చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఏటా లక్షల మంది పాలమూరు ప్రజలు వలస పోయే పరిస్థితి ఉండేది . కానీ నేడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే స్థాయి ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేసుకోబోతున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా పాలమూరుతో పాటు రంగారెడ్డి జిల్లా భూములకు సైతం నీళ్లు అందిస్తామన్నారు. గోదావరి బేసిన్‌లో కాళేశ్వరం, కృష్ణా బేసిన్‌లో పాలమూరు-రంగారెడ్డి లాంటి గొప్ప ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం కట్టిందని కేటీఆర్ తెలిపారు. సీతారామ ప్రాజెక్టు కూడా పూర్తి అయితే తెలంగాణ సాగునీటి రంగంలో ప్రాజెక్టులు సంతృప్త స్థాయిలో పూర్తి అవుతాయన్నారు. కేసీఆర్ నాయకత్వంలో కట్టిన ప్రాజెక్టులను చూస్తుంటే.. కేవలం తెలంగాణ బిడ్డగానే కాకుండా భారతదేశ పౌరుడిగా కూడా గర్వంగా ఉందన్నారు. ఉద్యమ కాలం నుంచి కేసీఆర్ ఆలోచనల మేరకు రూపుదిద్దుకున్న గొప్ప ప్రాజెక్టు ఇది అని కేటీఆర్ స్పష్టం చేశారు. పాలమూరు ఎత్తిపోతల అనేక అడ్డంకులను దాటుకుని కేసీఆర్ పట్టుదలతో పూర్తయిన ప్రాజెక్టు ఇది అని మంత్రి తెలిపారు. రైతుల పొలాలకు సాగునీటితో పాటు, రాజధాని ప్రజల తాగునీటి అవసరాలు, పరిశ్రమలకు అవసరమైన నీటి సరఫరాను కూడా ఈ ప్రాజెక్టు అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఇంత గొప్ప సందర్భాన్ని గొప్పగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాజెక్టు యొక్క విశిష్టతను ప్రజలకు తెలియజేసేలా గొప్పగా సంబరాలు చేసుకోవాలని సూచించారు. కనీసం లక్షన్నర మంది రైతులతో ప్రారంభోత్సవం సభ ఉంటుందని కేటీఆర్ తెలిపారు.

**పాలమూరు శ్లోకా తెలివితేటలకు ముగ్ధుడైన మంత్రి కేటీఆర్..** :



పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో ఉమ్మడి పాలమూరు జిల్లా సస్యశ్యామలం కాబోతున్నది. ఈ ప్రాజెక్టును ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నారు. ప్రాజెక్టులో భాగమైన నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్లను చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఏదుల వద్ద నిర్మిస్తున్న అత్యంత భారీ సర్జ్‌పూల్ భూగర్భ నిర్మాణాల్లో ఆసియాలోనే అతిపెద్దదిగా నిలువనున్నది. 90 మీటర్ల లోతు.. 306 మీటర్ల పొడవు.. 30 మీటర్ల వెడల్పుతో అత్యంత భారీగా నిర్మించిన సర్జ్‌పూల్‌ను చూసేందుకు జనాలు ఎక్కడెక్కడి నుంచో తరలివస్తున్నారు. ఇటీవలే వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన ప్రణవ శ్లోకా అనే అమ్మాయి తన తల్లిదండ్రులతో కలిసి ఏదుల సర్జ్‌పూల్‌ను సందర్శించింది. పదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతలపై అద్భుతంగా వివరించారు. సర్జ్‌పూల్‌ను చూసిన తర్వాత ఆశ్చర్యపోయాను. ఆ గుహలోకి వెళుతుంటే ఏదో కొత్త ప్రపంచంలోకి వెళ్తున్న ఫీలింగ్ అనిపించిందని ప్రణవ పేర్కొంది. ఒకప్పుడు పాలమూరు అంతా కరువు ప్రాంతం. సాగునీళు లేక వలసలు పోయేవారు. కానీ ఇప్పుడు సాగునీటి వనరుల వల్ల వలసలు వెళ్లిన వారు తిరిగి వస్తున్నారు. అసలు ఇలాంటి, ఇంత పెద్ద ప్రాజెక్టును ఎక్కడా చూడలేదు. ఈ ప్రాజెక్టుతో పాలమూరు జిల్లాలో కరువు మాయమైపోతుందని నమ్ముతున్నారు. భవిష్యత్‌లో ఆహారం కోసం ఇబ్బంది పడాల్సిన అవసరమే లేదు. ఇప్పటికే వరి ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌లో స్థానంలో ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా మరింత వరి ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది అని ప్రణవ తెలిపింది. కోనసీమ జిల్లాల మాదిరిగా ఉమ్మడి పాలమూరు మారుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వీడియోపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పందించారు. ప్రణవ శ్లోకా తెలివితేటలకు కేటీఆర్ ముగ్ధుడైపోయారు. శ్లోకా ఎంతో ఆత్మ విశ్వాసంతో మాట్లాడారని కేటీఆర్ ప్రశంసించారు. కేసీఆర్ ప్రభుత్వం లో పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రభావంతో పాటు, ఆమెకు మహబూబ్‌నగర్ కరువుపై అవగాహన ఉందన్నారు. ఆమె ఆలోచనలకు, వ్యక్తీకరణకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.




జీ20లో కీలక పరిణామం చోటు చేసుకొంది. ఆఫ్రికన్ యూనియన్‌కు శాశ్వత సభ్యత్వం ఇచ్చారు. నేడు భారత్ మండపంలో జరిగిన వన్ ఎర్త్ సెషన్ ప్రారంభోపన్యాసంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయాన్ని ప్రతిపాదించారు. అందరు సభ్యుల అంగీకారంతో ఆఫ్రికన్ యూనియన్‌కు శాశ్వత సభ్యత్వం ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఆఫ్రికన్ యూనియన్ అధినేతను శాశ్వత సభ్యులకు కేటాయించిన కుర్చీలో కూర్చోబెట్టారు. ఈ సదస్సులో ప్రధాని ప్రారంభోపన్యాసం చేస్తూ.. "మొరాకో భూకంప మృతులకు సంతాపం తెలియ జేస్తున్నాను. ప్రపంచం మొత్తం మొరాకోకు అండగా నిలవాలి. వారికి అవసరమైన సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. జీ20 అధ్యక్ష హెూదాలో భారత్ మీకు స్వాగతం పలుకుతోంది. ప్రస్తుతం 21వ శతాబ్దంలో ప్రపంచానికి కొత్త దిశ, దశ సూచించడానికి ఇదే కీలక సమయం. పాత సవాళ్లు ఇప్పుడు కొత్త సమాధానాలు కోరుతున్నాయి. అందుకనే మనం హ్యూమన్ సెంట్రిక్ అప్రోచ్‌తో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. కొవిడ్ 19 సంక్షోభం తర్వాత ప్రపంచంలో విశ్వాస రాహిత్యం ఏర్పడింది. యుద్ధం ఈ అపనమ్మకాన్ని మరింత పెంచింది. కొవిడ్‌ను ఓడించిన మనం ఈ విశ్వాస రాహిత్యంపై కూడా విజయం సాధించవచ్చు. మనందరం కలిసి ప్రపంచంలో నెలకొన్న అపనమ్మకాన్ని పారదోలుదాము. ఈ క్రమంలో సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ మంత్రం మనకు మార్గదర్శిగా ఉంటుంది. ప్రపంచంలో పేద, సంపన్న దేశాల మధ్య భేదాలు, ఆహారం, ఇంధనం నిర్వహణ, హెల్త్, ఎనర్జీ, నీటి భద్రత వంటి సమస్యలకు సమాధానం కోసం ముందుకు వెళ్లాల్సిందే. భారత్ జీ20 అధ్యక్షతన దేశం లోపల, బయట అందరిని కలుపుకొని పోవడానికి ప్రతీకగా నిలిచింది. ఇది ప్రజల జీ20 అనడానికి నిదర్శనంగా మారింది. దేశంలోని 70పైగా నగరాల్లో 200కుపైగా జీ20 సదస్సులు జరిగాయి" అని తెలిపారు. "సబ్‌కా సాథ్ భావనతోనే ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20 సభ్యత్వం ఇవ్వాలని భారత్ ప్రతిపాదిస్తోంది. ఈ ప్రతిపాదనకు అందరూ అంగీకరిస్తారని నమ్ముతున్నాను. మీ అనుమతితో జీ20 సభ్యుడి హెూదాలో ఆఫ్రికన్ యూనియన్ అధ్యక్షుడు గ్రూపులో స్థానాన్ని స్వీకరించాలని ఆహ్వానిస్తున్నాను" అని మోదీ ప్రకటించారు.

## వచ్చే ఎన్నికల్లో వారే కీలకం



హైదరాబాద్: కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేసున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నాడు ఆర్టీసీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.."2023-24 ఎన్నికల్లో ఈ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలి. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రావాలంటే క్షేత్ర స్థాయిలో బూత్ లెవల్ ఏజెంట్ నియామకం జరగాలి. ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించేది బూత్ లెవెల్ ఏజెంట్. కాంగ్రెస్ జెండాను మోసే నిఖార్సైన కార్యకర్తలను బూత్ లెవెల్ ఏజెంట్లుగా నియమించుకుందాం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో 43 లక్షల డిజిటల్ మెంబర్షిప్ చేసుకున్నాం. 90లక్షల ఓట్లు తెచ్చుకుంటే రాష్ట్రంలో 90 సీట్లు గెలుస్తాం. వంద రోజులు కాంగ్రెస్ పార్టీ కోసం, రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కేటాయించాలి. అయ్యప్ప, శివ మాలధారణలా కాంగ్రెస్ దీక్ష తీసుకుని, సోనియమ్మ మాల వేసుకుని కష్టపడాలి. కేసీఆర్ లక్ష కోట్లు దోచుకున్నారు. రజాకర్లు కూడా ఇంత దోపిడీ, విధ్వంసానికి పాల్పడలేదు. తెలంగాణలో సీడబ్ల్యూసీ సమావేశాలు జరగడం ఈ గడ్డకు దక్కిన గౌరవం. ఇక్కడ సమావేశాలు జరగడం పీసీసీ అధ్యక్షుడిగా నా జన్మ ధన్యం. వక్ఫ్ భూమిలో నాంపల్లి విజయ నగర్ కాలనీలో ఎంఐఎంకు అనుమతి ఇచ్చారు. మరి తుక్కుగూడలో కాంగ్రెస్ సభకు ఎందుకు ఇవ్వరు?. దేవుడి భూమి అనే సాకుతో అనుమతి నిరాకరించినా ఆ దేవుడే మనకు దారి చూపారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విజయభేరీ సభ కోసం వంద ఎకరాలు ఇచ్చారు. ధర్మమే కాంగ్రెస్‌ను గెలిపిస్తుంది. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే" వస్తోందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.




# ఈటెల వర్సెస్ కిషన్‌రెడ్డి

# ఆధిపత్యపోరు

## మాజీ మంత్రి కృష్ణయాదవ్ చేరికను అడ్డుకొన్న రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

## వేములవాడలో వికాస్‌రావుతో ఈటల రాజేందర్‌కు చెక్

## ఎత్తుకు పైఎత్తులు వేసుకొంటూ పార్టీ పరువు తీస్తున్న కిషన్‌రెడ్డి, ఈటల!

హైదరాబాద్ : మొన్నటి వరకూ ఈటల వర్సెస్ బండి.. నేడు ఈటల వర్సెస్ కిషన్‌రెడ్డి.. కమలదళంలో మళ్లీ కోల్డ్‌వార్ మొదలయ్యింది. తెలంగాణ కమలదళంలో రాజకీయ చదరంగం రంజుగా సాగుతున్నది. రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ ఉన్నంత కాలం ఈటల రాజేందర్ ఆయన మధ్య అంతర్గత విభేదాలు నడిచాయి. బండిని ఇంటికి పంపిన తర్వాతగానీ ఆ విభేదాలు చల్లారలేదు. తాజాగా, కమలం పార్టీలో రెండో ఇన్నింగ్స్ మొదలయ్యింది. ఇప్పుడు ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డి మధ్య పోరు ప్రారంభమైంది.

**ఎత్తుకు పైఎత్తు.. పార్టీ పరువు చిత్తు! :** రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇటు చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఎత్తుకు పైఎత్తులు వేసుకొంటూ.. బీజేపీ పరువు తీస్తున్నారనే అభిప్రాయం ఆ పార్టీవర్గాల్లో వ్యక్తమవుతున్నది. వేములవాడ నియోజకవర్గంలో తుల ఉమకు టికెట్ ఇప్పించుకొనేందుకు ఈటల మొదటి నుంచీ ప్లాన్ సిద్ధం చేశారు. మరోవైపు నగరంలోని అంబర్‌పేటనుంచి తన సతీమణికి టికెట్ ఇప్పించుకోవాలని కిషన్‌రెడ్డి శతవిధాలా ప్రయత్నిస్తున్నారనేది పార్టీవర్గాల సమాచారమే. రెండు నియోజకవర్గాల్లో ఇద్దరూ తమ తమ వ్యూహాల్లో నిమగ్నమై ఉన్నారు. కాగా, అంబర్‌పేటకు చెందిన మాజీ మంత్రి కృష్ణయాదవ్‌ను బీజేపీలో చేర్పించేందుకు ఈటల రంగం సిద్ధం చేయగా.. ఏకంగా మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు కుమారుడు డాక్టర్ వికాస్‌రావుకు బీజేపీ కండువా కప్పి ఈటలకు కిషన్‌రెడ్డి చెక్ చెప్పారు. వేములవాడలో తన వ్యూహానికి చెక్ పెట్టేందుకే వికాస్‌రావును పార్టీ లో చేర్చుకొన్నారా? అని కిషన్‌రెడ్డిని ఈటల నిలదీసినట్టు సమాచారం. 'వాళ్లు రాజకీయాల్లోకి వస్తానన్నారు, వాళ్లది బీజేపీ కుటుంబమైనందునే నేను చేర్చుకున్నా' అంటూ కిషన్‌రెడ్డి బదులిచ్చినట్టు తెలిసింది. దీంతో ఈటల ఫోన్ స్విచ్చాఫ్ చేసుకొని పత్తా లేకుండా పోయారనే వార్తలు వినిపిస్తున్నాయి.

అటు ఈటల ఫోన్ బంద్.. ఇటు పార్టీ కార్యాలయం నుంచి పిలుపు రాకపోవడంతో కృష్ణయాదవ్ తలపట్టుకొంటున్నారు. ఈటల, కిషన్‌రెడ్డి పోరుతో పార్టీ పరువు బజారునపడటమేకాదు.. టికెట్ ఆశావహుల్లో గుబులు రేపుతున్నదని నేతలు వాపోతున్నారు.

# సంపాదకీయం

## చైనా కొంప ముంచుతున్న 'కన్యాశుల్కం'..!

కన్యాశుల్కం గురించి గురజాడ అప్పారావు మనకు ఎప్పుడో చెప్పారు. కన్యాశుల్కం అంటే వివాహ సమయంలో వరుడు తరుపు బంధువులు వధువు తల్లిదండ్రులకు ఇచ్చే కానుక. ఈ ట్రెండ్ భారతదేశంలో ఇప్పుడు లేదు కానీ ఒకప్పుడు ఉండేది. ఇప్పుడు వరుడికే వధువు తరుపు తల్లిదండ్రులు కానుకలు(కట్నం) ఇస్తున్నారు. కట్నం ఇవ్వడం.. తీసుకోవడం చట్ట వ్యతిరేకం. అయినప్పటికీ అనధికారికంగా ఈ కట్నాలు లక్షల నుంచి కోట్లకు చేరుకున్న సంగతి అందరికీ తెల్సిందే. నచ్చిన వరుడు(గవర్నమెంట్ ఉద్యోగి) కోసం అమ్మాయిలు తరుపు తల్లిదండ్రులు పెట్టే ఖర్చు గురించి చెప్పనక్కర్లేదు. ఆ తర్వాత జాబితాలో సాఫ్టేవర్లు.. బిజినెస్ మ్యాన్లు ఉంటున్నారు. ఇక నీతి నిజాయితీ అని కష్టపడి పని చేసి నాలుగు రాళ్లు వెనుక వేసుకునే వాడికి పిల్లనిచ్చే వాళ్లే కరువయ్యారు ఈ రోజుల్లో. ఉదాహరణకు రైతు గురించి చెప్పొచ్చుకోవచ్చు. దేశానికి అన్నం పెట్టే రైతు పిల్లను ఇవ్వాలంటే తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నారు. అలాగే ప్రైవేట్ ఉద్యోగులది సైతం ఇదే పరిస్థితి. ఇలాంటి చెప్పుకుంటే పోతే కొకల్లాలు ఉన్నాయి. అమ్మాయిల తల్లిదండ్రులు తమ కూతురిని గవర్నమెంట్ ఉద్యోగికి ఇచ్చి చేస్తేనే బాగుంటుందని నమ్మడం వల్లే ఈ సమస్య వస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మన దేశంలో అమ్మాయిలు వరుడి చేసుకునేందుకు నానా కండిషన్లు పెడుతుంటే ఇక చైనాలో పరిస్థితి మరోలా ఉంది. చైనాలోని గ్రామీణ ప్రాంతాల్లో కన్యాశుల్కం అనేది ఒక ఆచారంగా నడుస్తోంది. అయితే ఇది రాను రాను పెద్ద సమస్యగా మారుతోంది. మనదేశంలో వరుడి కోసం కోట్లు ఎలా అయితే ముట్టజెబుతున్నారో చైనాలో సైతం అమ్మాయిని పెళ్లి చేసుకునేందుకు వరుడి తల్లిదండ్రులు కోట్లల్లో కానుకలు ఇవ్వాల్సి వస్తుంది. ఇటీవల ఒక చైనా యువతిని పెళ్లి చేసుకునేందుకు వరుడిని ఆమె 8లక్షల యువాన్లు కావాలని డిమాండ్ చేసింది. మన కరెన్సీలో ఇది సుమారు కోటి వరకు ఉంటుందని అంచనా. అంత మొత్తం చెల్లించలేక వరుడి తరుపు తల్లిదండ్రులు వివాహం క్యాన్సిల్ చేసుకున్నారట. ఇలాంటివి చైనాలో తరుచూ చోటు చేసుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన ఈ సమస్య ఇప్పుడు అర్బన్ ఏరియాలకు పాకింది. కొన్ని దశాబ్దాలుగా చైనా 'వన్ చైల్డ్' విధానాన్ని అమలు చేసింది. దీంతో చైనాలో జనాభా క్రమంగా తగ్గుముఖం పట్టింది. 2023లో చైనాలో తొలిసారి జనాభా తగ్గుదల కన్పించింది. దీనికితోడు చైనా యువత పెళ్లి చేసుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. దీంతో పెళ్లి వయస్సు పెరిగిపోయింది. ఒకే చైల్డ్ విధానంలో వల్ల చాలా మంది అబ్బాయికి ప్రాధాన్యం ఇవ్వడంతో అమ్మాయిల జనాభా భారీగా తగ్గుముఖం పట్టింది. చైనాలో 100 మంది పెళ్లి కాని ప్రసాదులకు కేవలం 63 మంది అమ్మాయిలు మాత్రమే ఉన్నారని గణాంకాలు చెబుతున్నారు. దీంతో చైనాలోని పెళ్లి కాని యువతులకు భారీగా డిమాండ్ పెరిగింది. చైనాలో వృద్ధుల సంఖ్య పెరిగిపోవడంతో పాటు ఇటీవల జనాభా క్రమంగా తగ్గుతుండటంతో చైనా దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. పెళ్లి చేసుకోకుండా పిల్లలను సైతం కనేందుకు కొన్ని రాష్ట్రాల్లో అనుమతి ఇచ్చింది. అయితే కొన్ని దశాబ్దాలుగా చైనా అనుసరించిన వన్ చైల్డ్ విధానానికి అక్కడి ప్రజలు అలవాటు పడిపోయారు. దీంతో పిల్లలను ఎక్కువగా కనేందుకు వాళ్లు ఇష్టపడటం లేదు. రోజురోజుకు పెరుగుతున్న ఖర్చులు సైతం దీనికి ఒక కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితి చూస్తుంటే చైనా వన్ చైల్డ్ విధానంతో తన గొయ్యి తానే తీసుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో కన్యాశుల్కం భారంగా మారుతుండటంతో అబ్బాయిలు సైతం పెళ్లి చేసుకునేందుకు ఆసక్తి చూపించడం లేదు. దీంతో ఈ సమస్య రాబోయే రోజుల్లో చైనా కొంప ముంచడం ఖాయమనే కామెంట్స్ విన్పిస్తున్నాయి.

# స్వయం ఉపాధి.. ఎండమావే!



జయశంకర్ : గిరిజనుల అభివృద్ధికి ఏటూరునాగారం ఐటీడీఏ ఆర్థిక స్వావలంబన పథకం(ఈఎస్ఎస్) కింద రాయితీ రుణాలను అందిస్తోంది. స్వయం ఉపాధి కల్పనకు రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల ఆర్థిక సహాయ సహకార సంస్థ(ట్రైకార్) ద్వారా వివిధ పథకాలను అమలు చేస్తోంది. వ్యాపారాలు, వాహనాలు, ఇతర యూనిట్లు ఏర్పాటు చేసుకొని ఆర్థిక సాధికారత సాధించేందుకు గిరి బిడ్డలకు చేయూత నందిస్తున్నారు. ఈ పథకాలు వారికి సకాలంలో అందక ఎదురుచూడాల్సి వస్తోంది. ఏటా లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి రుణాలు అందించాల్సి ఉన్నా అమలులో జాప్యం అవుతోంది. బడ్జెట్ కేటాయింపులకు తగినట్లు రాయితీలు విడుదల కాకపోవడంతో గిరిజనులు నిరీక్షిస్తున్నారు.

**మూడేళ్లుగా అందని వైనం**

2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన రాయితీ రుణాల పంపిణీలో జాప్యం అవుతోంది. రాయితీ రుణాల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. 2020-21 సంవత్సరానికి 1,553 యూనిట్లకు రూ.11.66 కోట్ల రాయితీ, 2021-22 సంవత్సరానికి 5497 యూనిట్లకు రూ.43.98 కోట్లు రాయితీ కేటాయించారు. లబ్ధిదారులు ఎంచుకున్న యూనిట్ను బట్టి రూ.లక్ష నుంచి రూ.5 లక్షలకు పైగా రుణాలు తీసుకునే అవకాశం ఉంటుంది. 60 నుంచి 80 శాతం వరకు రాయితీ పొందే అవకాశం ఉంటుంది.

ఎంపిక పూర్తయినా..!2021, 2022 రెండు ఆర్థిక సంవత్సరాలకు ఒకేసారి లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేశారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. 6,761 యూనిట్లకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. గ్రామ సభల ఎంపిక పూర్తయిన తర్వాత ఎంపీడీవోలు లబ్ధిదారుల జాబితాను బ్యాంకులకు ఇస్తారు. అక్కడ తనిఖీ అనంతరం ఐటీడీఏ పీవోకు వెళుతుంది. ఆయన దరఖాస్తులను పరిశీలించి రాయితీ కోసం కమిషనరేట్‌కు పంపిస్తారు. అక్కడ ట్రైకార్ నుంచి రాయితీని లబ్ధిదారుల ఖాతాకు మళ్లిస్తారు. ఆ తర్వాత లబ్ధిదారునికి ఎంచుకున్న యూనిట్‌ను అందిస్తారు. ఇప్పటికీ కేవలం 946 యూనిట్లు మాత్రమే ఐటీడీఏ నుంచి కమిషనరేట్‌కు వెళ్లాయి. వాటికి కూడా రాయితీ రాలేదు. మిగతా యూనిట్లకు సంబంధించిన దరఖాస్తులు ఎంపీడీవో, బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

**కార్యాచరణ ప్రణాళిక ఎప్పుడు..?**

ట్రైకార్ రాయితీ రుణాల కార్యాచరణ ప్రణాళిక ఆర్థిక సంవత్సరం ఆఖరు వరకు ముందే సిద్ధం చేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే వచ్చే 2022-23, 2023-24 సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించలేదు. రెండేళ్ల రుణాలు పంపిణీ ప్రక్రియ పూర్తయితేనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కార్యాచరణ రూపొందించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఏ సంవత్సరానికి కేటాయించిన రాయితీ రుణాలు, అదే ఏడాది ఇచ్చేలా చూస్తే ఇంకా ఎక్కువ మంది గిరిజనులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుంది.

**నమ్మకం పోయింది : బంగారి శ్రీధర్, తాడ్వాయి**

మాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. నా భార్యకు వంటలు చేయడం బాగా వచ్చు. గిరిజన సంక్షేమశాఖ అధ్వర్యంలో శిక్షణ పొందింది. ఇద్దరం కలిసి మండలకేంద్రంలో చిన్నపాటి హెూటల్ పెట్టుకునేందుకు రుణం కోసం ఐటీడీఏలో దరఖాస్తు చేశాను. ఐటీడీఏ పీవో రూ. లక్ష రుణం మంజూరు చేశారు. కానీ ఇంత వరకు అందించలేదు. ఏడాదిగా ఐటీడీఏ, ఎంపీడీవో కార్యాలయాలు, కెనరా బ్యాంకు చుట్టూ తిరిగి తిరిగి వేశారిపోయాను. రుణం వస్తుందనే నమ్మకం పోయింది.

**పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నాం- అంకిత్, పీవో, ఐటీడీఏ, ఏటూర్‌నాగారం**

రాయితీ రుణాల పంపిణీకి కృషి చేస్తున్నాం. ఆయా మండలాల నుంచి లబ్ధిదారుల జాబితాలను తెప్పించి, ఎప్పటికప్పుడు కమిషనరేట్‌కు పంపిస్తున్నాం. లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేసేలా కృషి చేస్తాం.

# ఆలోచనలు.. ఆవిష్కరణలు!!

వరంగల్ : 'నువ్వేం ఆలోచిస్తావో అలాగే ఉంటావ్' అన్నారు గౌతమ బుద్ధుడు. ఈ ప్రపంచంలో మనిషి భౌతికంగా రూపమిచ్చే ప్రతిదీ మొదట అతని మెదడులో ఆలోచనగా రూపు దాలుస్తుంది. తద్వారా గొప్ప ఆవిష్కరణ సాకారమవుతుంది. చెట్టుపై నుంచి యాపిల్ కిందకే ఎందుకు పడింది? పైకెందుకు వెళ్లలేదని న్యూటన్ ఆలోచించారు.. కాబట్టే భూమ్యాకర్షణ శక్తి గురించి మనకు తెలిసింది. మనిషి మెదడు పదునెక్కాలంటే బుర్ర గొప్ప ఆలోచనలు చేయాలి.. వాటిని సాకారం చేసేందుకు ఆచరణకు దిగాలి. నేడు ప్రపంచ ఆలోచనా దినోత్సవం (వరల్డ్ థింకింగ్ డే). ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్‌కు చెందిన పలువురు ఆవిష్కర్తల గురించి ప్రత్యేక కథనం.

అలా మొదలైంది ప్రపంచ ఆలోచన దినోత్సవం 1926లో ప్రారంభమైంది. స్కౌట్స్ గైడ్స్ అమ్మాయిలు మేటిగా ఎదగాలని దీన్ని ప్రారంభించారు. ప్రతి సంవత్సరం ఒక కొత్త అంశంతో విశ్వ వ్యాప్తంగా నిర్వహిస్తారు ఈ సారి 'మన ప్రపంచం, మన శాంతియుత భవిష్యత్తు' అనే అంశంతో నిర్వహిస్తున్నారు.

**'అగ్రిమేట్' యాప్**

కోతల సమయంలో కూలీలు దొరకరు. కొన్ని చోట్ల కూలీలున్నా వారికి సరైన పని దొరకదు. ఈ సమస్యకు ఓ అప్లికేషన్ రూపొందించారు హనుమకొండ జిల్లా దిల్లీ పబ్లిక్ పాఠశాల్లో చదువుతున్న నలుగురు విద్యార్థులు. వీరిలో ముగ్గురు 11వ తరగతి, ఒకరు 12వ తరగతి. వీరి ఆలోచన జాతీయ స్థాయిలో మేటిగా నిలిచింది. దిల్లీ ఐఐటీలో సీబీఎస్ఈ పాఠశాలల విద్యార్థులతో 'యూత్ ఐడియాథాన్ 2022' పోటీలు జరిగాయి. అందులో దేశవ్యాప్తంగా 5 వేల పాఠశాలల నుంచి 62వేల మంది విద్యార్థులు తమ స్టార్టప్‌తో పోటీ పడ్డారు. ఇన్ని వేల మందిలో మనవారు మొదటి 25 జట్లలో మేటిగా నిలిచి రూ. 10వేల నగదు బహుమతి అందుకున్నారు. 'అగ్రిమేట్' అనే యాప్‌ను కె.రాజేశ్వరి, జి.స్వీహాని నాయక్, రోహిత్ రాథోడ్, దూత్ రాఘవ రూపొందించారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు వ్యవసాయ కుటుంబంలో నుంచి వచ్చారు. కూలీల దొరక్క గ్రామాల్లో రైతులు పడుతున్న సమస్య నుంచే ఈ ఆలోచన వచ్చింది. రైతులు, కూలీలను అనుసంధానం చేసేలా ఈ యాప్‌ను డిజైన్ చేయడంతో ఇది అంకుర పోటీల్లో మేటిగా నిలిచింది.

**ఖర్చు లేకుండా విత్తనాలు వేసుకోవచ్చు..**

జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం ఆజాంనగర్‌కు గ్రామానికి చెందిన ఏదులాపురం శశిధర్ మహాముత్తారం మండలం దొబ్బలపాడులోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. రైతులకు ఉపయోగకరంగా ఉండే 'మల్టీపర్పస్ అగ్రికల్చర్ టూల్'ను తయారు చేశారు. దీని ద్వారా సులభంగా ఎరువులు, విత్తనాలను వేసుకోవచ్చు. ఖర్చు కూడా చాలా తక్కువే. వైర్‌లెస్ టెస్టర్, బోరు మోటారును చరవాణి ద్వారా ఆన్ ఆఫ్ చేసే పరికరం తయారు చేశారు. గత రెండేళ్లుగా తెలంగాణ ఇంటింటా ఇన్నోవేటర్ పోటీలకు ఎంపికై ప్రతిభ కనబరుస్తున్నారు. 3వ తరగతిలోనే ఆటోమేటిక్ ఆన్ ఆఫ్ వీధి దీపాల పరికరం తయారు చేసి ఔరా అనిపించారు. ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తే మరిన్ని ఆవిష్కరణలు చేసేందుకు సిద్ధంగా ఉంటానని చెబుతున్నాడు శశిధర్. ప్రస్తుతం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ ప్రదర్శన శాలలో ఆయన తయారు చేసిన పరికరాన్ని ప్రదర్శిస్తున్నారు.

పనితీరు: పత్తి, మిర్చి, టమాట, వంకాయ, తదితర పంటలలో వినియోగించవచ్చు. పొడవాటి గొట్టానికి పైన ఎరువు, విత్తనాలు వేసుకునేలా ఒక ప్లాస్టిక్ డబ్బా అమర్చారు. దాని చివరన చెమ్మస్‌ను బిగించారు. ఎరువు కావల్సినంత కిందకు జారవిడిచేలా హ్యాండిల్‌కు క్లచ్‌ను అమర్చారు. ముందుగా ఎరువు పడేచోట చెమ్మస్‌ను భూమిలోకి



జొప్పిస్తారు. తర్వాత హ్యాండిల్ క్లచ్‌తో విత్తనాలను లేదా ఎరువును జార విడుస్తారు. తర్వాత చెమ్మస్‌ను తీసి కాలితో మట్టిని పూడుస్తారు.

**కందిలో కొత్త వంగడం...**

వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలకు కొత్త ఆలోచన వచ్చింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని సాగు భూమికి అనుకూలమైన కంది వంగడాన్ని రూపొందించారు. అది ప్రస్తుతం ఉత్తమ ఫలితాల్ని అందిస్తోంది. వానకాలం, యాసంగిలో సాగు చేసేందుకు అనుకూలం. దీనిని రూపొందించేందుకు వరంగల్ శాస్త్రవేత్తలు సుమారు ఆరేళ్ల పాటు పరిశోధనలు సాగించారు. 2021 యాసంగిలో పరిశోధనలు పూర్తి చేసి 2022లో అధికారికంగా విడుదల చేశారు దీనికి వరంగల్ కంది-2 ( డబ్ల్యూ ఆర్‌జీ-255) అని నామకరణం చేశామని, పరిశోధన కేంద్రం ఏడీఆర్ డా.రావుల ఉమారెడ్డి తెలిపారు. పంటకాలం 170 నుంచి 180 రోజులు. 100 విత్తన గింజల బరువు 9 నుంచి 10 గ్రాములు ఉంటుంది. వర్షాధారంగా సాగు చేస్తే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. నీటి తడులతో సాగు చేస్తే ఎకరాకు 10 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎండు తెగులును సమర్థంగా తట్టుకుంటుంది. ఈ వంగడాన్ని సాగు చేసేందుకు తెలుగు రాష్ట్రాల రైతులు ముందుకు రావడంతో డిమాండ్ పెరిగింది.

**విద్యుత్తు సరఫరాలో అంతరాయం రాకుండా ..**

పంజాబ్ రాష్ట్రంలో 2012లో అదనంగా విద్యుత్తు వినియోగించాలనే ప్రయత్నం చేసిన సందర్భంలో ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల మధ్యలోని బినా గ్వాలియర్ ఆగ్రా కారిడార్‌లోని ట్రాన్స్‌మిషన్ లైన్ ట్రిప్ అయింది. రెండు రోజుల పాటు 14 రాష్ట్రాల్లో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సరఫరాలో సమస్యలు రాకుండా హైవోల్టేజ్ సబ్‌స్టేషన్ల పరిధిలో 'ఫేజ్ ఆర్ మెజర్‌మెంట్ యూనిట్' (పీఎంయూ) ముందస్తుగా గుర్తిస్తుంది. దేశ వ్యాప్తంగా 319 హైవోల్టేజ్ సబ్ స్టేషన్లు ఉండగా పది లోపు మాత్రమే పీఎంయూ డివైజ్‌లు ఏర్పాటు చేశారు. ఈ డివైజ్ ఖరీదు ఎక్కువ కావడంతో అన్ని స్టేషన్లలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయింది. తక్కువ సంఖ్యలో డివైజ్‌లు ఏర్పాటు చేసి ఎక్కువ స్టేషన్లు పర్యవేక్షించే విధంగా వరంగల్ నిట్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పేర్లి సురేష్ బాబు సరికొత్త సాంకేతికతను ఆవిష్కరించారు. అల్గారిదమ్ టెక్నాలజీ రూపొందించారు. 142 డివైజ్‌ల ద్వారా దేశంలో ఎక్కడైనా విద్యుత్తు సమస్య తలెత్తితే వెంటనే తెలుసుకునే సదుపాయం ఉంటుంది. 2020లో ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. 2022లో సమగ్ర నివేదికను సమర్పించారు. పవర్ గ్రిడ్ సంస్థలు ఆమోదిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ప్రొఫెసర్ సురేష్‌బాబు తెలిపారు.

# ఉపాధికి జనరిక్

హనుమకొండ : జనరిక్ మందులు.. మధ్య, పేద తరగతి ప్రజలకు వరం. చాలా తక్కువ ధరకు లభిస్తాయి.. అయితే అవగాహన అంతంత మాత్రమే.. దుకాణాలు పరిమిత సంఖ్యలో ఉన్నాయి. వీటిని ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. షాపుల ఏర్పాటుకు సహకారం అందిస్తోంది. వీటి ద్వారా మహిళలకు ఉపాధి కల్పించాలని సరికొత్తగా అడుగులు వేస్తోంది.

స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు స్త్రీ నిధి ద్వారా జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం రుణాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఒక్కొక్కరికి రూ. 3 లక్షల రుణం ఇవ్వనుంది. ఎంత మంది అర్హులంటే అందిరికీ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా అర్హులకు అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రుణాల మంజూరుకు స్త్రీనిధి నిబంధనలను సడలించారు. ఆసక్తి, అవగాహన ఉన్న మహిళా సంఘాల్లోని కుటుంబసభ్యులు, బంధువులు ముందుకు రావాలని అధికారులు కోరుతున్నారు.

**అవగాహన అవసరం**

దేశంలో జనరిక్ మందులకు ఆదరణ పెరుగుతోంది. రాష్ట్రంలో



ప్రజలకు సరైన అవగాహన లేక, పలు అనుమానాలు ఉండటంతో పూర్తి స్థాయిలో ఆదరణ లభించడం లేదు. ఈ మందులపై ప్రజల్లో అవగాహన పెంచడంతో మహిళలకు ఉపాధి కల్పించే విధంగా దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఈ విషయమై అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలి. మహిళా సంఘాలకు అవగాహన కల్పించడంతో పాటు ఉపాధి ఏ విధంగా ఉంటుందో వివరించాలి. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేవలం 100 దుకాణాలు మాత్రమే ఉన్నాయి.

**నిబంధనలు ఇవే**

మహిళా సంఘాల్లో సభ్యులు మాత్రమే కాదు.. వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు సభ్యులకు రుణాలు అందిస్తారు. లి తప్పని సరిగా డీఫాం, ఎంఫాం, బీఫార్మసీ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. లి షాపు ఏర్పాటు చేసుకునే వారు కనీసం 120 గజాల స్థలాన్ని చూపించాలి. లి ఇప్పటికే అల్లోపతి మెడికల్ దుకాణం ఉంటే దానికి అదనంగా జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటుకు రుణం పొందవచ్చు. లి అర్హత, ఆసక్తి ఉన్న వాళ్లందరికీ రుణలు అందజేస్తారు.

**ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**-ఎం.అశోక్, స్త్రీనిధి రీజినల్ మేనేజర్, హనుమకొండ జిల్లా**

జిల్లాలోని మహిళా సంఘాల సభ్యుల్లో ఎవరికైనా జనరిక్ మెడికల్ దుకాణం ఏర్పాటు చేసుకోవాలనే ఆసక్తి ఉంటే గ్రామైఖ్య సంఘాలను గానీ, స్త్రీనిధి అధికారులను గానీ సంప్రదించాలి. రూ.3లక్షల వరకు రుణం అందించే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

# ఇదే పొదుపు పాటిద్దాం.. వేసవి గండం గట్టెక్కుదాం

వరంగల్ : కార్పొరేషన్: ధర్మసాగర్- వరంగల్ 2100 ఎంఎం డయా పైపులైన్‌పై కొత్తగా మూడు బట్టర్‌ఫ్లై వాల్వ్‌ల బిగింపు పనులతో నగరంలో మూడు రోజుల పాటు(6, 7, 8 తేదీలు) తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్తలు, సుమారు 7.50 లక్షల మందికి నీటి సరఫరా నిలిచిపోయినప్పటికీ పొదుపుతో గండం గట్టెక్కారు. నల్లా నీళ్లను పొదుపుగా వాడుకున్నారు. ఇదే జాగ్రత్తలు పాటిస్తే వేసవి ఇబ్బందులుండవని నిపుణులంటున్నారు.'

**వేసవి తాగునీటి అవసరాలు**

సాధారణ రోజుల్లో రోజూ 4 ఎంసీఎఫ్‌టీల నీటిని వాడుతారు. వేసవి కాలంలో అదనంగా 2 ఎంసీఎఫ్‌టీలు పెరుగుతాయి.

సాధారణ రోజుల్లో ప్రతి మనిషికి 20 లీటర్లు అవసరమని అంచనా.ఎండా కాలంలో 30- 40 లీటర్లు వాడుతారని అంచనా.



నల్లా నీటిని కేవలం తాగేందుకు, వంట చేసుకునేందుకు ఉపయోగించాలి. బట్టలు ఉతకడం, మొక్కలకు ఇతర అవసరాలకు బోరు నీటిని వాడితే వేసవిలో నీటి ఎద్దడి ఉండదంటున్నారు.

**తాగేందుకు వాడాంస్రవంతి, కాశీబుగ్గ**

నల్లాలు బంద్ అవుతాయని తెలిసి ముందు నుంచే నీళ్లు నిల్వ చేసుకున్నాం. నల్లా నీటిని కేవలం తాగేందుకు, వంట కోసం వాడాం. ఇతర అవసరాలకు బోరు నీటిని వినియోగించాం. నీటి ఇబ్బంది ఎదురుకాలేదు.

**మరో రెండు రోజులకు సరిపోతాయిడి.స్వరూప, కాశీబుగ్గ**

కొన్ని నెలలుగా రోజూ నల్లా నీళ్లు వస్తున్నాయి. మూడు రోజులు బంద్ అవుతున్నాయని పేపరులో చూశాను. మా ఇంట్లో ఉన్న ఖాళీ పాత్రల్లో నింపాను. మరో రెండు రోజులు సరిపోతాయి.

**నిల్వతో ఇబ్బందుల్లేవురమ, తిలక్‌రోడ్**

నల్లా నీటిని అన్ని పాత్రల్లో నింపాను. ముందు రోజు గంటన్నర పాటు తాగునీళ్లు వచ్చాయి. డ్రమ్ము, బిందె, వంట పాత్రల్లో నింపుకున్నాం. మూడు రోజుల పాటు ఇబ్బందుల్లేవు. మేము నల్లా నీళ్లనే తాగుతాం.

**ముందుగానే ప్రకటించాలివాణి, ఎల్బీనగర్**

మూడు రోజులు నల్లా నీళ్లు రావని ముందుగా ప్రకటించడం మంచిదైంది. సాయంత్రం పూట నల్లా రాగానే మా ఇంట్లో ఉన్న డ్రమ్ము, క్యాన్, వంట పాత్రల్లో నింపాను. మూతలు కూడా పెట్టాం. ముందస్తు జాగ్రత్తపడితే వచ్చే ఎండాకాలంలో ఇబ్బందులు ఉండవు.

## వంతెన పనులు పూర్తయ్యేదెప్పుడో?

జనగామ : జనగామ మండలం వడ్లకొండలోని వాగుపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులు పడకేశాయి. నాలుగు నెలల క్రితం కల్వర్టు పూర్తిగా కూలి పోవడంతో ఈ దారిలో వాహనాల రాకపోకలకు ఆటంకమేర్పడింది. తాత్కాలికంగా వాహనాలను గానుగుపహాడ్ మీదుగా మళ్లించారు. కొన్ని రోజుల తర్వాత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు వాగుపై తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు. వంతెన నిర్మాణ పనులు ప్రారంభించగా.. కొన్నాళ్లు ఇలా రాకపోకలు సాగాయి. గతేడాది జులైలో కురిసిన భారీ వర్షాలతో తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. ఆ తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టినా.. అధికారులు వంతెన నిర్మాణ పనులపై దృష్టి సారించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

వాహనదారులఅవస్థలు..జనగామ-హుస్నాబాద్ రహదారి.. కరీంనగర్, హుస్నాబాద్, నర్మెట్ట, తరిగొప్పుల, చిల్పూరు ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అనుసంధానంగా ఉండటంతో ఈ దారిలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వాహనాలను జనగామ-మద్దూరు రహదారి, గానుగుపహాడ్ రహదారి మీదుగా మళ్లించారు. ఈ రోడ్డు మూడు కిలో మీటర్ల వరకు ఒకే వరుస రహదారిగా ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ధ్వంసమైన రహదారులు, పైపులైన్లు

జనగామ-హుస్నాబాద్ రహదారి మీదుగా వెళ్లే వాహనాలను గానుగుపహాడ్ మీదుగా మళ్లించడంతో, భారీ వాహనాలు గ్రామం మీదుగా వెళ్లడంతో ప్రధాన అంతర్గత రహదారులు, మిషన్ భగీరథ పైపులైన్లు, తాగునీటి పైపులైన్లు, భూగర్భ మురుగు కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దుమ్ము, ధూళితో ప్రజలు అవస్థలు పడుతున్నారు.



చేతులెత్తేసిన అధికారులు

కల్వర్టు కూలిపోయి నాలుగు నెలలవుతోంది. వంతెన నిర్మాణానికి ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. రెండు నెలల క్రితం ఈ పనులను ప్రారంభించారు. పునాది నిర్మాణ పనులు చేస్తుండగా భారీ వర్షాలతో ఇసుక మేటలు వేశాయి. 15 రోజుల తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టినా.. పనులు ప్రారంభించేందుకు అధికారులు, గుత్తేదార్లు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. గానుగుపహాడ్ మీదుగా వాహనాలను మళ్లించి ప్రజాప్రతినిధులు, అధికారులు చేతులు దులుపుకున్నారు. వాహనాలను మళ్లించిన రహదారిపై కనీసం తాత్కాలిక మరమ్మతులు చేయించేందుకు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.-దడిగ తిరుపతి, గానుగుపహాడ్, జనగామ మండలం

జనగామ-హుస్నాబాద్ రహదారిలో ఉన్న కల్వర్టు కూలిపోవడంతో వాహనాలను గానుగుపహాడ్ మీదుగా తరలిస్తున్నారు. గ్రామంలోని సీసీ, మట్టి రోడ్లు దెబ్బతిన్నాయి. మిషన్ భగీరథ, మురుగుకాలువ పైపులైన్లు దెబ్బతిన్నాయి. తాగునీరు రావటం లేదు, నిత్యం దుమ్మూ ధూళితో అవస్థలు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలి, గ్రామంలో సీసీ రోడ్లు, కొత్త పైపులైన్లు వేయించాలి.పీఆర్ శాఖ అధికారులదే బాధ్యత-అశోక్, ఆర్అండ్‌బీ, డీఈ, జనగామ

వడ్లకొండ వద్ద వాగుపై వంతెన దెబ్బతినటంతో వాహనాలను గానుగుపహాడ్ మీదుగా మళ్లించాం. జనగామ-మద్దూరు రహదారి దెబ్బతినడంతో బీటీ రెన్యూవల్ పనులు చేయించాం. గ్రామ ప్రధాన రహదారిపై మరమ్మతులు, ఇతర నిర్వహణ పనులు చేయించడం పీఆర్ శాఖ పరిధిలోనిది. వర్షాలు తగ్గిన తర్వాత వంతెన నిర్మాణ పనులు చేపడతాం.

త్వరలో మరమ్మతులు ప్రారంభిస్తాం-చంద్రశేఖర్, పీఆర్ డీఈ

గానుగుపహాడ్‌లో అంతర్గత రహదారి మరమ్మతు పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. కంకర, మట్టితో రహదారి మరమ్మతు పనులు చేయించేందుకు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. కొన్ని రోజుల్లో పనులను మొదలు పెడతాం.

## సజీవ సాక్ష్యాలకు బీటలు

భువనగిరి : సంస్థాన్ నారాయణపురం ఒక నాడు భోగభాగ్యాలతో అలరాడింది. రాజులు గతించినా.. రాచరికపు వ్యవస్థ అంతమైనా వారి తాలూకు గత వైభవపు స్మృతులు మాత్రం మిగిలే ఉన్నాయి. వందల ఏళ్ల క్రితం నిర్మించిన కట్టడాలు గ్రామానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి. వీటిని చూసేందుకు ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు తరలివచ్చే వారు. ఆనాడు రాజ పరిపాలన చేసిన నారాయణరెడ్డి నారాయణపురం చుట్టూ ఎత్తైన గడీ గోడలు నిర్మించారు. ఊరుకు నలుమూలలుగా దిడ్డి దర్వాజాలు, ఊరు పక్కనే ఉన్న గుట్టపైన బురుజులు కట్టించారు. పక్కనే మరో గుట్టపైన విశ్రాంతి కోసం ఫలక్‌నుమా భవనాన్ని నిర్మించారు. చూస్తే పరిపాలన లోని భూభా గమంతా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ చారిత్రక కట్టడాలకు బీటలు వారి కనుమరుగవుతున్నాయి. ఇప్పటికే గిరి బంగ్లా, రాణివాసం, ఫలక్‌నుమా, దిడ్డి దర్వాజ కనుమరుగయ్యాయి. గుట్టపైన బండరాళ్లతో నిర్మించిన బురుజులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇటీవలే ఓ దిడ్డి దర్వాజ కనుమరుగవగా మరొకదానిపై భారీ చెట్లు పెరిగి ప్రమాదకర స్థితులకు చేరుకున్నాయి. దాని మధ్య నుంచే రహదారి ఉండటంతో నిత్యం జనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిని కాపాడ కుంటే రాబోయే కాలంలో శిథిలమయ్యే పరిస్థితి నెలకొంది. సంస్థాన్ నారాయణపురం ఏడో రాజైన మహబూబ్ అలీఖాన్ 1904లో నిర్మించి న 60 అడుగుల ఆజాద్ మినార్‌సైతం బీటలు వారింది. ప్రస్తుతమున్న కట్టడాలను భావితరాలకు అందించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



## 'డబుల్' ఇళ్లు.. సొంతంగా నిర్మాణాలు



వరంగల్ : నిర్మాణంలో ఉన్న ఈ ఇళ్లు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోనివి. గుత్తేదారు అసంపూర్తిగా వదిలేయడంతో 25 మంది లబ్ధిదారులు తమ సొంత డబ్బులు వెచ్చించి నిర్మించుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక బిల్లు ఇప్పించే బాధ్యత తనదేనని స్థానిక ఎమ్మెల్యే శంకర్‌నాయక్ హామీ ఇచ్చారు. ఒక్కో లబ్ధిదారుడు ఇప్పటికే రూ.1.5 లక్షలు వెచ్చించారు. పూర్తయ్యే వరకు మరో రూ.ఆరేడు లక్షలైనా ఖర్చవుతాయని.. అవి తాము ఎక్కడి నుంచి తేవాలని ఆందోళనకు గురవుతున్నారు.

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను గుత్తేదారులు అసంపూర్తిగా వదిలేయడంతో చేసేదేం లేక లబ్ధిదారులే సొంతంగా నిర్మించుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా పలుచోట్ల ఈ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి ఉచితంగా ఇళ్లు అందుకోవాల్సిన నిరుపేదలు గుత్తేదారుల తీరు వల్ల రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. ఆర్థిక స్తోమత లేనివారు వచ్చింది వదులుకోలేక, ఇచ్చిందాన్ని పూర్తి చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ఖర్చు తగ్గించుకునేందుకు వారే ఇంటి నిర్మాణ పనుల్లో పాల్గొంటున్నారు.

జనగామ మండలం షామీర్‌పేటలో పరిశీలిస్తే.. ఇక్కడ 29 ఇళ్లు మంజూరయ్యాయి. 14 పైకప్పు దశ, 2 గోడల వరకు, మరో 13 పునాది దశలోపే వదిలేశారు. వీటికి లాటరీ విధానంలో లబ్ధిదారులను గుర్తించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో ఆమేరకు అర్హులకు అప్పగించారు. సొంత డబ్బులు పెట్టి నిర్మాణాలు పూర్తి చేసుకుంటే తర్వాత బిల్లులు ఇప్పిస్తామని స్థానిక ఎమ్మెల్యేలు నోటి మాటగా హామీ ఇచ్చారు. తర్వాత బిల్లులు గుత్తేదారు పేరిట వస్తే.. వారి నుంచి లబ్ధిదారులకు ఎంత మేర నిధులు వస్తాయనేదానిపై స్పష్టత లేదు.

జనగామ జిల్లాలోనే వివిధ ప్రాంతాల్లో వందకుపైగా ఇళ్లను లబ్ధిదారులే నిర్మించుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురు, గూడూరు, మరిపెడ తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి.

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం బ్రాహ్మణ కొత్తపల్లిలో 25 ఇళ్లను గుత్తేదారు పిల్లర్ల స్థాయిలో నిర్మించి వదిలేయడంతో, లబ్ధిదారులు తమ సొంత ఖర్చులతో నిర్మాణం ప్రారంభించారు. ఇక్కడ ఇళ్లు 75 శాతం నిర్మాణం పూర్తయ్యింది.

స్థలం లబ్ధిదారులదే..

కొన్ని చోట్ల పరిస్థితి మరీ విచిత్రంగా ఉంది. స్థలం లబ్ధిదారులదే కావడం.. పేరు మాత్రం ప్రభుత్వం ఇచ్చే రెండు పడక గదుల ఇల్లుగా ఉండడం గమనార్హం.

జనగామ జిల్లా నర్మెట్ట మండలం హన్మంతాపూర్‌లో స్థలమూ లబ్ధిదారులదే. 2017లో 20 గృహాలను ఇక్కడ కేటాయించారు. సముదాయ నిర్మాణానికి స్థల సేకరణ జరగలేదు. దీంతో సొంత స్థలంలోనే నిర్మించుకునే అవకాశం కల్పించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అయోధ్యపురంలో లబ్ధిదారులు తమ సొంత స్థలాల్లోనే నిర్మాణాలు చేపడుతున్నారు.

జనగామ జిల్లా కేంద్రం సమీపంలోని షామీర్‌పేటకు చెందిన మామిడి విమల తన రెక్కల కష్టంతో నలుగురు కుమార్తెలను చదివిస్తోంది. ఆమెకు ప్రభుత్వం నుంచి రెండు పడక గదుల ఇల్లు లాటరీలో మంజూరైంది. గుత్తేదారు శ్లాబ్‌దశలో అసంపూర్తిగా వదిలేసిన ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు విమల తన బంగారం తాకట్టుపెట్టారు. భర్త ఆనందం మేస్త్రీగా, తాను, కుమార్తెలు కూలీలుగా ఇంటి పనులు చేస్తున్నారు. వంటగది, పడక గదులు కట్టే శక్తి లేదని, చుట్టూ గోడలు మాత్రమే నిర్మించుకున్నారు. బిల్లు కోసం ఎదురుచూస్తున్నారు.

## ఆకర్షణీయం.. ఆగమాగం



వరంగల్ : 'కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ 2015లో దేశవ్యాప్తంగా వంద నగరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు స్మార్ట్‌సిటీ పథకాన్ని తీసుకొచ్చింది. రెండో దశలో (2016) వరంగల్ ఎంపికైంది. ఈ పథకం కింద పనులు ఐదేళ్లలో పూర్తి కావాలి. ఏటా రాష్ట్రం, కేంద్రం చెరో రూ.వంద కోట్లు కేటాయిస్తూ మొత్తంగా రూ.వెయ్యి కోట్లను ఖర్చు చేయాలి.' భద్రకాళి బండ్ రెండో దశ కింద రూ.65 కోట్లతో పనులు ప్రారంభించారు. 60 శాతం మాత్రమే పూర్తయ్యాయి. గాయత్రి గుడి నుంచి పోతన రోడ్డు వరకు ఈ పనులు కొనసాగుతున్నాయి.వడ్డేపల్లి చెరువు బండ్ బలోపేతం చేసేందుకు ఈ పథకం కింద రూ. 22 కోట్లు వెచ్చించారు. ఈ నిధులతో ఇరువైపులా రిటైనింగ్ గోడ నిర్మాణం, డివైడర్లు నిర్మించి సుందరీకరణ పనులు చేపట్టాలి. గడువు ప్రకారం ఇప్పటికే పూర్తి కావాల్సి ఉంది. ఏడాదిన్నర కిందట మొదలైనా ఇప్పటికీ పూర్తి కాలేదు.పద్మాక్షి గుట్ట స్మార్ట్ రోడ్డు పనులకు 2018లో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ పూర్తి కాలేదు. ఒకవైపు రోడ్డు వేసి మరో వైపు వదిలేయడంతో రాత్రివేళల్లో వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. సగం రోడ్డు వేసి వదిలేశారు.

ఆకర్షణీయ పథకం పనులు ఓరుగల్లు నగరంలో నామమాత్రంగా కొనసాగుతున్నాయి. 2017లోనే స్మార్ట్‌సిటీ కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించి పనులు ప్రారంభించారు. ఇప్పటికీ పూర్తి కాలేదు. మరోవైపు ఎంపిక చేసిన పనులను సైతం ఎడాపెడా రద్దు చేస్తూ ఆ నిధులను ఇతర పనులకు మళ్లిస్తున్నారు.

రద్దయిన ఎస్టీపీ రూ.200 కోట్లు ఏమైనట్టు?నగరం నుంచి నిత్యం వెలువడే మురికినీరు శుద్ధి కోసం రెడ్డిపురం వద్ద రూ.200 కోట్ల నిధులతో 100 ఎంఎల్‌డీ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను బల్దియా ప్రతిపాదించింది. ఇది పూర్తి చేస్తే మురుగు నీటి సమస్యకు మంచి పరిష్కారం లభించేది. భూసేకరణ సమస్యగా ఉందని ఈ ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేశారు. దీని కింద మంజూరైన నిధులను స్మార్ట్‌సిటీలో లేని ప్రాజెక్టులకు మళ్లించినట్టు సమాచారం. మొత్తంలో నిధులను ఏయే ప్రాజెక్టులకు కేటాయించారన్న సమాచారం కూడా లేదు.

ఇక్కడ ఇలా..

నగరవాసులకు అన్ని శాఖల నుంచి మెరుగైన సేవలు అందించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నడిచేలా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను రూపకల్పన చేశారు. బల్దియా కార్యాలయంలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రచించారు. ఇప్పటికీ ఇది ఏర్పాటుకాలేదు.

సంక్షిప్తంగా..మన పొరుగున్న కరీంనగర్‌లో ఆకర్షణీయ పథకం కింద మొదలైన పనులు వేగంగా నడుస్తున్నాయి. స్మార్ట్ రహదారులు పూర్తయ్యాయి.నగరానికి నాలుగు వైపులా పర్యాటకులకు ఆహ్వానం పలికేందుకు ప్రతిపాదించిన గ్రాండ్ ఎంట్రన్స్ పనుల్ని కూడా మధ్యలోనే వదిలేశారు.హనుమకొండలో చేపట్టిపన పనులు కొంత మేర బాగున్నాయి. పబ్లిక్ గార్డెన్‌లో రైడ్ల ఏర్పాటు, గ్రంథాలయాల్లో వసతుల కల్పన పూర్తయ్యాయి. ఎంజీఎంలో ఎస్టీపీ పనులు జరిగాయి. ఉర్సు చెరువు వద్ద ఎస్టీపీ పనులు జరుగుతున్నాయి.

## అనుమతి లేకుండా.. ఎవరికీ తెలియకుండా..!

భువనగిరి : భువనగిరి పట్టణం విద్యానగర్‌లోని మున్సిపల్ కమిషనర్ నివాస గృహంలో గత వారం రోజులుగా పురపాలకుల అనుమతులు లేకుండా పునర్ నిర్మాణ పనులు కొనసాగుతుండటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. పురపాలక సంఘానికి విద్యానగర్ లేఅవుట్‌లో గతంలో 200 నుంచి 250 చదరపు గజాల్లో నిర్మించిన 14 నివాస గృహాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో గజం భూమి రూ.80 వేలు పలుకుతుంది. దశాబ్దాలుగా అద్దెకు ఉంటున్న 13 మంది తమ పేరిట గృహాలను రిజిస్ట్రేషన్ చేయాలని అప్పట్లో ప్రభుత్వానికి అర్జీ పెట్టుకోవడంతో 13 నివాస గృహాలను 2016-17లో వారి పేరిట అప్పటి మున్సిపల్ కమిషనర్ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ రిజిస్ట్రేషన్లు నిబంధలనకు విరుద్ధంగా జరిగాయని అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం కొన్నేళ్లుగా ఇదే లేఅవుట్‌లో మున్సిపల్ కమిషనర్ నివాస గృహం నిరుపయోగంగా మిగిలింది. అప్పట్లో కమిషనర్‌గా పనిచేసిన బాలాజీనాయక్ లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నివాస యోగ్యంగా మార్చి కొద్ది నెలల పాటు ఇందులో ఉన్నారు. ఇదే నివాస గృహంలో బాలాజీనాయక్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడటంతో తదుపరి వచ్చిన కమిషనర్లు ఇందులో ఉండేందుకు ఇష్టపడ లేదు. గత వారం రోజులుగా మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండానే ప్రైవేటు గుత్తేదారు పనులు చేస్తున్నారు. ఈ విషయమై ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ అధికారులను వివరణ కోరగా.. తమకు తెలియదని సమాధానం ఇచ్చారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని వివరణ కోరగా.. తమ అనుమతులు లేకుండానే రూ.10లక్షల వ్యయంతో పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు చేపడుతున్న పనులు బుధవారం నిలిపివేయించామని వివరణ ఇచ్చారు. నివాస గృహాన్ని ప్రజా అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంటే కౌన్సిల్‌లో తీర్మానం చేసి నిబంధనల మేరకు కేటాయిస్తామని వివరణ ఇచ్చారు.

నివాస గృహాన్ని పరిరక్షించాలి: భాజపావిద్యానగర్‌లోని కమిషనర్ నివాస గృహాన్ని పరిరక్షించాలని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి భాజపా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉదయగిరి విజయ్‌కుమార్, నల్లమాస సుమ, జనగాం కవిత, బొర్ర రాకేశ్, రత్నపురం బలరాంలు పాల్గొన్నారు.

## రాగి జావ.. రోజూ ఇస్తే మేలు

వీర్నపల్లి : సర్కారు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సంపూర్ణ పోషణ అందించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అర్ధాకలితో వచ్చే చిన్నారులకు స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పీఎం పోషణ్ కార్యక్రమంలో భాగంగా బాల బాలికలకు రాగి జావ పంపిణీ చేస్తున్నారు. అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. సాంకేతిక సమస్యల కారణంగా పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. లక్ష్యం మేరకు బాల బాలికలకు అందని పరిస్థితి నెలకొంది. జిల్లాలోని 13 మండలాల పరిధిలో 489 ప్రభుత్వ, 7 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 45,013 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ బడుల్లో చదివే బాల బాలికలకు శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు భాగస్వామ్యంతో రాగి జావ తయారీకి సంబంధించిన ముడి సరకులు సమకూరుస్తుంది. ఆయా పాఠశాలల్లోని ఏజెన్సీలకు చెందిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు దీనిని తయారీ చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అధికంగా గ్రామీణ పేద కుటుంబాలకు చెందిన వారే కావడంతో ఉదయం అల్పాహారం చేయకుండానే తరగతులకు హాజరవుతుంటారు. మధ్యాహ్న భోజనం వరకు పాఠాలు వినాలంటే నీరసానికి లోనవుతుంటారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించాలన్న లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పిల్లలకు రాగి జావ పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతేడాది జిల్లాలోని 167 పాఠశాలల్లో కార్యక్రమం అమలు కాగా ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో పోషకాహారం పంపిణీ చేయాలని అధికారులు ఆదేశించారు.

ఏడు రకాల సరకులతో...

పోషకాహార లోపాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఏడు రకాల సరకులతో కూడిన పొట్లాలను అందిస్తుంది. గతంలో పాఠశాలకు చెందిన బాధ్యులు జిల్లా కేంద్రానికి వెళ్లి తీసుకువచ్చేవారు. ప్రస్తుతం మండల వనరుల కేంద్రానికి పొట్లాలు సరఫరా అవుతున్నాయి. అక్కడి నుంచి అన్ని పాఠశాలలకు పంపిణీ జరుగుతుంది. ఈ పొట్లాల్లో రాగి, బెల్లం, సోయా, బియ్యం పిండి, ఉప్పు, దాల్చిన చెక్క, పసుపుతో కూడిన మిశ్రమం ఉంటుంది.

క్షేత్ర స్థాయిలో ఇలా...

రాగి జావ మిశ్రమాన్ని పాఠశాలల్లోని ఏజెన్సీలకు చెందిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు తయారు చేయాలి. ఉదయం పూట విరామ సమయంలో పిల్లలకు అందించాలి. పనిభారం కారణంగా నిర్వాహకులు జావ తయారీకి ఆసక్తి చూపడం లేదు. ప్రత్యేకంగా జావ తయారీ చేసినా ఎలాంటి అదనపు భత్యం ఇవ్వకపోవడంతో మొగ్గు చూపడం లేదు. కొన్ని పాఠశాలల్లో రోజు విడిచి రోజు పంపిణీ చేస్తున్నా, మరికొన్ని పాఠశాలల్లో అసలు పంపిణీ కావడం లేదు. కోడి గుడ్డు పంపిణీ చేసిన రోజుల్లో రాగి జావ ఇవ్వడం లేదు. ఫలితంగా పొట్లాలు మూలన పడుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరడం లేదు.

రక్తహీనత బారిన పడకుండా...

రాగి జావ పంపిణీతో చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నిర్మూలించవచ్చు. అర్ధాకలితో వచ్చే పిల్లలకు ఇది ఆసరాగా ఉంటుంది. కార్బోహైడ్రేట్లు, ఐరన్, విటమిన్స్ సమృద్ధిగా ఉండటంతో దీనిని తీసుకున్న పిల్లలు శ్రద్ధాసక్తులతో పాఠాలు వినే అవకాశం ఉంటుంది. ఆరోగ్య పరంగా విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. చిన్నతనంలో రక్తహీనత బారిన పడకుండా మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

విద్యార్థులకు అందిస్తున్నాంజిల్లాలోని అన్ని పాఠశాలల్లో రాగి జావ పంపిణీ కొనసాగుతోంది. రోజూ విద్యార్థులకు రాగి జావ అందిస్తున్నాం. ఇది తీసుకున్న పిల్లలకు ఆరోగ్య పరంగా మేలు చేకూరుతుంది. రమేశ్ కుమార్, జిల్లా విద్యాధికారి

## రూ.కోట్ల నిధులు.. వరద పాలు

సిరిసిల్ల : చెక్‌డ్యాంల నిర్మాణంలో నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ అధికారుల అంచనాలు తారుమారయ్యాయి. ఫలితంగా భారీ వర్షాలకు మూలవాగులో ప్రవహించిన వరద ఉద్ధృతికి కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాంల కరకట్టలు తెగిపోయాయి. ప్రజల సొమ్ము నీటి పాలైంది. మరోవైపు ప్రభుత్వ లక్ష్యం నెరవేరని దుస్థితి నెలకొంది.జిల్లాలోని మానేరు, మూలవాగులపై 24 చెక్‌డ్యాంలకు రూ.227 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 2020 డిసెంబరులోనే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. వీటిలో 16 నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కో చెక్‌డ్యాంకు రూ.2 కోట్ల నుంచి గరిష్ఠంగా రూ.30 కోట్ల వరకు కేటాయించారు. మొదటి నుంచి నిర్మాణాలపై జలవనరులశాఖ నిశిత దృష్టి సారించడంలేదు. మూడేళ్లుగా వరదల ఉద్ధృతికి కొట్టుకుపోతున్నాయి.

మానేరు, మూలవాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలన్నింటికీ ఒకే డిజైన్ ఉంది. దీనికితోడు వాగుల వెడల్పు ఒక్కో చోట 100 మీటర్ల నుంచి 200 మీటర్ల వరకు ఉంది. మానేరు వాగుపై ముస్తాబాద్ మండలం ఆవునూరు వద్ద నిర్మించిన చెక్‌డ్యాంకు రక్షణగోడ నిర్మాణం లేక పక్కనున్న పంట పొలాలు కోతకు గురయ్యాయి.

సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్ వద్ద నిర్మించిన చెక్‌డ్యాం అసంపూర్తి దశలో కొట్టుకుపోయింది. తంగళ్లపల్లి వైపు పూర్తిగా కోతకు గురైంది.

మూలవాగుపై కోనరావుపేట మండలం మరిమడ్ల వద్ద రూ.2తో నిర్మించిన చెక్‌డ్యాం 2021 మే నెలలోనే పూర్తయింది. అదే ఏడాది వరదలకు రక్షణగోడ కోతకు గురికావడంతో సమీపంలో సుమారు 30 ఎకరాలు కోతకు గురయ్యాయి. ఇదే మండలంలో మామిడిపల్లి వద్ద నిర్మాణంలోని చెక్‌డ్యాం పక్కనున్న పంట పొలాలను వరద ముంచెత్తింది. దీనిపైన ప్రైవేటు ఇసుక రీచ్‌కు రెవెన్యూ, గనులశాఖ అనుమతులిచ్చింది. ఇసుక తవ్వకాలతో ఆ ప్రాంతం గొయ్యిగా మారింది. పైనుంచి వచ్చిన వరదంతా ఇసుక రీచ్‌లోకి మళ్లింది. ముందు చెక్‌డ్యాం అడ్డుగా ఉండటంతో పక్కనున్న పంట పొలాలను ముంచెత్తింది. ఈ ప్రాంతంలో సుమారు 150 ఎకరాల్లో ఇసుకమేటలు వేశాయి.సగం వాటికి దెబ్బ

వీర్నపల్లి మండలంలో ప్రారంభమైన మూలవాగు కోనరావుపేట, వేములవాడ గ్రామీణ మండలం, వేములవాడ పట్టణం సమీపం నుంచి వెళ్లి మధ్యమానేరు (రాజరాజేశ్వర) జలాశయంలో కలుస్తుంది. మూలవాగులో నిర్మించిన చెక్‌డ్యాంల్లో వేములవాడ మహాలక్ష్మి వీధి, జయవరం, బొల్లారం, మామిడిపల్లి, మర్రిమడ్ల తదితర చెక్‌డ్యాంల కరకట్టలు భారీ వర్షాలకు వచ్చిన ప్రవాహానికి దెబ్బతిన్నాయి. కొన్ని సిమెంట్ గోడలు పక్కకు కొట్టుకుపోయాయి. దీన్ని బట్టి వరద ఏ స్థాయిలో ముంచెత్తిందో ఊహించవచ్చు. ఈ పరిస్థితులను అంచనా వేయకుండా నిర్మించడమే ఇందుకు కారణం. అయితే వీటికి మరమ్మతులు శాఖాపరంగా చేస్తారా? గుత్తేదారు చేపడతారా? అనే దానికి ఇంకా స్పష్టత లేదు. చెక్‌డ్యాంల కరకట్టలు తెగిపోయి రూ.కోట్లల్లో నష్టం వాటిల్లింది. అయితే వీటి ఎత్తును దాదాపు మీటరు తగ్గించాలనే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలిసింది. అధికారుల అంచనాకు మించి వరద రావడంతోనే చెక్‌డ్యాంల కరకట్టలు కోతకు గురై నష్టం జరిగినట్లు చెబుతున్నారు. ఎత్తును తగ్గించడమా, లేకుంటే రీ డిజైన్ చేయాలా అనేది శాఖాపరంగా ఉన్నతాధికారులు నిర్ణయించాల్సి ఉందని ఇంజినీరింగ్ అధికారులు పేర్కొన్నారు.

# పల్లె ఠాణాకు పురస్కారం

మధిర : ఉత్తమ సేవలు, ఆహ్లాదకర వాతావరణం, తక్కువ కేసుల మేళవింపుతో మధిర గ్రామీణ పోలీస్ స్టేషన్ ఉత్తమ ఠాణాగా నిలిచింది. తెలంగాణ రాష్ట్రంలో 30 పోలీస్‌స్టేషన్లు ఎంపికవగా వాటిలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మధిర గ్రామీణ పోలీస్‌స్టేషన్ ఉండటం విశేషం. జిల్లా మొత్తంలో పురస్కారం పొందిన ఏకైక ఠాణాగా గౌరవం దక్కించుకుంది.

మూడు దశాబ్దాల ప్రస్థానం

1990లో గ్రామీణ పోలీస్‌స్టేషన్ మధిర పట్టణంలోనే వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ప్రారంభమైంది. ఆ స్థలంలో పోలీస్‌స్టేషన్ ఖాళీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మధిర మండల పరిధిలోని ఖాజీపురం గ్రామంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట సర్కారు స్థలం గ్రామీణ ఠాణాకు కేటాయించారు. ఈ సువిశాల స్థలంలో ఠాణా



నిర్మాణం పూర్తవగా ఆరు నెలల క్రితం ఇక్కడ ప్రారంభించారు. ఆవరణలో పెంచిన మొక్కలు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. మరోవైపు వాహనాల నిలుపుదల కోసం ప్రత్యేకంగా స్థలాలను కేటాయించారు.

ఇవీ సేవలు గ్రామీణ ఠాణా ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికవటానికి దోహదపడ్డ కారణాలివే. ఇక్కడ మహిళల నేరాల సంఖ్య తక్కువగా ఉండటం ఠాణాలో బలహీనవర్గాల కేసులు స్వల్పంగా నమోదవడం తప్పిపోయిన కేసులు, గుర్తుతెలియని మృతదేహాల కేసులు తక్కువగా ఉండటం.దొంగతనాల సంఖ్య తక్కువగా నమోదు కావడంతోపాటు సొత్తు రికవరీ అధికంగా ఉండటం.

ఠాణాకు ఉత్తమ అవార్డు రావడం మాలో బాధ్యతను మరింతగా పెంచింది. భవిష్యత్తులోనూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం. ఇందులో సమష్టి కృషి ఉంది. సిబ్బందికి అభినందనలు.

ఉతల్ రఫీ, మధిర గ్రామీణ ఎస్సై

# ఆంగ్లంపై పట్టు.. ప్రయోగంతో మెట్టు

భూపాలపల్లి : ప్రస్తుతం ఆంగ్ల భాష వినియోగం పెరిగిపోయింది. ఆ భాషలో సంభాషించేందుకు అత్యధికులు ఆసక్తి చూపుతున్నారు. దీనిని గుర్తించి ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేస్తోంది. ఇంటర్ విద్యార్థులు కూడా ఆంగ్లంపై పూర్తి పట్టు సాధించేలా ఇంటర్ బోర్డు ప్రయోగ పరీక్షల్లో మార్పులు చేసింది. ఇప్పటివరకు సైన్సు విభాగాలకే పరిమితమైన ప్రయోగ పరీక్ష, ఇకపై ఆంగ్ల భాష వినియోగంలోనూ నిర్వహించనున్నారు. ఇందుకు తగ్గట్టుగా ప్రత్యేక ప్రాక్టికల్ పుస్తకాలను విద్యార్థులకు అందించారు. వీటి ఆధారంగా జిల్లాలో అన్ని ప్రభుత్వ కళాశాలల్లో బోధన చేపడుతున్నారు. రానున్న మార్చిలో నిర్వహించే ప్రయోగ పరీక్షల కోసం ఇప్పటి నుంచే సన్నద్ధం చేస్తున్నారు.

1,760 మంది విద్యార్థులకు..

జయశంకర్ జిల్లాలో ఐదు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఐదు ప్రైవేటు కళాశాలలు, 27 ప్రభుత్వ సెక్టార్ కళాశాలలున్నాయి. వీటిలో 1,760 మంది ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు వివిధ కోర్సుల్లో చదువుతున్నారు. ఇంటర్ బోర్డు నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం మొదటి సంవత్సరం చదువుతున్న వీరందరికీ ఆంగ్ల పాఠాలలో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రెండో సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తారు.

నాలుగు అంశాల్లో..

ఆంగ్ల సబ్జెక్టు ప్రయోగ పరీక్షలకు 20 మార్కులు, రాత పరీక్షకు 80 మార్కులుంటాయి. ప్రధానంగా నాలుగు అంశాలపై ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. 1, కమ్యూనికేషన్ ఇంగ్లిష్, 2, జేఏఎమ్ ( జస్ట్ ఎ మినిట్) ఒక నిమిషంలో మాట్లాడం, 3, రోల్ ప్లే (ఇద్దరు విద్యార్థుల సంభాషణ ), 4, లిజనింగ్ కాంప్రెహెన్షన్ అంశాలపై విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తారు. ఒక్కో అంశానికి నాలుగు మార్కుల చొప్పున 16 మార్కులు, రికార్డు నిర్వహణకు 4 మార్కులుంటాయి. దీని ప్రకారం విద్యార్థులకు సూచనలు చేస్తూ, ఆంగ్లంలో సంభాషించడం, వ్యాకరణం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, డాక్యుమెంటరీ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.



యూనిట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం
– అనిల్‌కుమార్, అధ్యాపకులు, భూపాలపల్లి

ఆంగ్ల సబ్జెక్టు ప్రాక్టికల్స్ కోసం విద్యార్థులకు ప్రత్యేకంగా యూనిట్ టెస్టులు నిర్వహిస్తున్నాం. 20 మార్కులు రాత పరీక్షకు, 5 మార్కులు ప్రాక్టికల్స్‌కు కేటాయించి, వారిని ముందస్తుగా సన్నద్ధం చేస్తున్నాం. రెగ్యులర్ తరగతుల్లో వారంలో ఒకటి, రెండు పీరియడ్‌లలో ఆంగ్ల సంభాషణ చేయిస్తున్నాం. దీని వల్ల విద్యార్థులు ఒకేసారి ఇబ్బంది పడకుండా ఉంటారు.

సులభంగా మార్కులు సాధించొచ్చు– దేవరాజం, ఇంటర్ విద్య నోడల్ అధికారి, భూపాలపల్లి ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆంగ్ల సబ్జెక్టుపై ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తాం. ప్రత్యేకంగా పుస్తకాలను ఇప్పటికే పంపిణీ చేశాం. వాటి ఆధారంగా అధ్యాపకులు విద్యార్థులను సన్నద్ధం చేయాలి. విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధిస్తే 20 మార్కులు సులభంగా సాధించవచ్చు. వచ్చే నెల మొదటి వారంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆంగ్ల సబ్జెక్టుపై ప్రయోగ పరీక్షపై అవగాహన కల్పిస్తాం.

# రామయ్య చెంతకు రైలుమార్గం




భద్రాచలం : ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న పాండురంగాపురం రైల్వేమార్గానికి మోక్షం కలగనుంది. బూర్గంపాడు మండలం పాండురంగాపురం నుంచి సారపాక వరకు రైల్వేమార్గాన్ని విస్తరించాలన్నది ఈ ప్రాంతవాసుల దశాబ్దాల కల. దీనికి సంబంధించి గతంలో అనేక సర్వేలు జరిగాయి. అయినా రైల్వేమార్గం నిర్మాణ పనులు పట్టాలెక్కలేదు. ఒడిశాలోని మల్కాన్‌గిరి నుంచి భద్రాచలం మీదుగా పాండురంగాపురం వరకు రైల్వేలైను విస్తరించాలని అధికారులు 2021లో ప్రతిపాదించారు. ఇందుకోసం సుమారు రూ. 2,800 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. దీనిపై రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పలుమార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సర్వేలు జరిగాయి. తాజాగా రైల్వే శాఖ తెలంగాణలోని 15 రైల్వేమార్గాలకు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్.ఎల్.ఎస్)ని మంజూరు చేసింది. ఇందులో మల్కాన్‌గిరి– పాండురంగాపురం రైల్వేమార్గం ఉండటంతో ఈ ప్రాంతవాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

బహుళ ప్రయోజనాలు

మల్కాన్‌గిరి– పాండురంగాపురం మార్గం నిర్మాణానికి రూ. 3,592 కోట్లు అవసరమని రైల్వేశాఖ ఉన్నతాధికారులు తాజాగా అంచనా వేశారు. సుమారు 186 కి.మీ. పొడవు కలిగిన ఈ మార్గం అందుబాటులోకి వస్తే భద్రాద్రి రామయ్య భక్తులతో పాటు స్థానిక పరిశ్రమలకు ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్య, వ్యవసాయం, వ్యాపారావకాశాలు మెరుగవుతాయని ఆశిస్తున్నారు. ఓడరేవులకు దూరభారం తగ్గుతుందనే నిర్ధారణకు వచ్చారు. దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న రామాలయానికి ఏడాదికి 30 లక్షల మంది చొప్పున భక్తులు వస్తున్నట్లు అంచనా. పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ ఆగ్యుమెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) పథకం కింద ప్రస్తుతం పర్యాటక సొబగులద్దుతున్నారు. రామాయణ వలయంలో భద్రాచలానికి ఇటీవల చోటు కల్పించారు. ఈ రైలుమార్గం అందుబాటులోకి వస్తే పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా ఈప్రాంతం అభివృద్ధి చెందే అవకాశముంది.

# వైద్య విద్యార్థుల ప్రవేశాల్లో అద్వితీయ సందడి




కొత్తగూడెం : జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో '2023–24' విద్యా సంవత్సరం సీట్ల కేటాయింపు ప్రక్రియ వేగంగా సాగుతోంది. రెండో బ్యాచ్ ప్రథమ సంవత్సరానికి తొలి విడతలో 107 సీట్లు కేటాయించారు. గత ఏడాది నుంచి జిల్లాలో నూతన వైద్య కళాశాల అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఆ వెంటనే ప్రవేశాలు కల్పించి తరగతులూ ప్రారంభించారు.

గత విద్యా సంవత్సరం కళాశాలకు మొత్తం 150 సీట్లు కేటాయించారు. వీటిలో 149 మంది చేరారు. వైద్య విద్య ప్రవేశాలు పొందినవారిలో విద్యార్థినుల సంఖ్యే అధికంగా ఉండటం విశేషం. భర్తీ అయిన మొత్తం సీట్లలో 62 మంది బాలురు.. 87 మంది బాలికలున్నారు. ఈ ఏడాది కూడా గతేడాది సీట్లనే కొనసాగిస్తున్నారు. రెండో బ్యాచ్ తొలి సంవత్సరానికి 150 మందికి ప్రవేశం కల్పిస్తారు. మొదటి విడతలో 107 మందికి సీట్లు కేటాయించారు. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. మార్పులు, చేర్పులు, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్ వంటి వాటికి ఆస్కారం ఉండటంతో.. విద్యార్థులకు మరికొంత సమయాన్ని వెసులుబాటుగా కల్పించారు. దాదాపు కేటాయించిన సీట్లన్నీ భర్తీ అయ్యే అవకాశాలున్నాయి. త్వరలో తరగతులు ప్రారంభించేందుకు, కొత్త విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించేందుకు కళాశాల బాధ్యులు చొరవ చూపుతున్నారు.

అన్ని వసతులు అందుబాటులో..

వైద్య కళాశాల ప్రారంభించిన నాటి నుంచే తొలి బ్యాచ్ వారికి తరగతుల నిర్వహణకు ఏ ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండటంతో బోధనాపరమైన ఇబ్బందులు తలెత్తలేదు. అనాటమీ ల్యాబ్, ప్రత్యేక తరగతి గదులు విశాలమైనవి అందుబాటులో ఉన్నాయి. సెంట్రల్ లైబ్రరీని కూడా వినియోగంలోకి తీసుకొచ్చారు. అనాటమీ తరగతుల నిర్వహణకు అవసరమైన మృతదేహాలను భద్రపరిచేందుకు అధునాత సదుపాయాలు సమకూర్చారు. ఉస్మానియా, గాంధీ వంటి ఆసుపత్రుల నుంచి మృతదేహాలను ఇక్కడకు తీసుకొచ్చారు. ఆ విభాగంలో తరగతుల బోధన సజావుగా సాగుతోంది. జిల్లా సర్వజన ఆసుపత్రి నుంచి కూడా మృతదేహాలను స్వాధీనం చేసుకునేలా శాఖాపరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో తగిన నిబంధనలు పాటించాల్సి ఉంది.

ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం

వైద్య కళాశాలకు అవసరమైన సదుపాయాలను సమకూర్చడంలో ప్రభుత్వం నుంచి మంచి సహకారం అందుతోంది. గత ఏడాది ప్రారంభమైన కళాశాలలో అన్ని సౌకర్యాలు, చక్కని వసతులు అందుబాటులో ఉన్నాయి. తరగతుల బోధనలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి అధ్యయనాలకు అవసరమైన సౌకర్యాలను స్థానికంగా ఏర్పాటు చేసుకుంటున్నాం. కళాశాల నూతన భవనంలోనూ అవసరమైన సదుపాయాలు ఒక్కొక్కటిగా సమకూరుతున్నాయి. స్థానికులై ఇక్కడ చేరిన వారికీ ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుత విద్యా సంవత్సరం మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ దాదాపు పూర్తికావొచ్చింది. డా. లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపల్

# కలహాలు వీడేనా.. కారు జోరందుకునేనా..?

ఖమ్మం : శాసనసభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. సుమారు మూడు నెలల ముందే అభ్యర్థుల్ని ప్రకటించిన గులాబీ దళపతి కేసీఆర్.. ఎన్నికలకు కార్యోన్ముఖులు కావాలంటూ పార్టీ అభ్యర్థులు, ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేశారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఈసారి అత్యధిక స్థానాలు గెలిచేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భారాస అధినేత ఆదేశాలతో రంగంలోకి దిగిన నేతలంతా.. రాబోయే ఎన్నికల్లో పదికి పది స్థానాలు గెలిచి కేసీఆర్‌కు కానుకగా అందిస్తామంటూ ప్రకటిస్తున్నారు. అయితే.. ఇందుకు తగ్గట్టుగా గులాబీ దళం కార్యాచరణ కానరావటం లేదు. దీనికి తోడు పార్టీకి స్తంభాల్లాంటి ముఖ్యనాయకులంతా ఎవరికి వారే యమునాతీరే అన్నట్టు వ్యవహరిస్తుండటంతో గులాబీ శ్రేణులు కలవరపడుతున్నాయి.




శ్రేణుల్లో నైరాశ్యం!

తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా గులాబీ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టినా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చేదు ఫలితాలు వచ్చాయి. కొత్తగూడెం స్థానాన్ని మాత్రమే గెలుచుకుంది. 2018 ఎన్నికల్లోనూ ఖమ్మం శాసనసభ స్థానానికే పరిమితమైంది. తదనంతర రాజకీయ పరిణామాలతో భారాస గూటికి ఏడుగురు చేరటంతో అధికార పార్టీ ప్రాతినిధ్యం వహించే స్థానాల అంకె ఎనిమిదికి చేరింది. ఈసారి ఎన్నికలను భారాస అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కేసీఆర్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది. అదే సమయంలో పలువురు ముఖ్యనేతలు పార్టీని వీడుతుండటంతో గులాబీ శ్రేణుల్లో నైరాశ్యం అలుముకుంది. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే కాంగ్రెస్ గూటికి చేరారు. భారాస అభ్యర్థులెవరినీ అసెంబ్లీ గేటు తాకనివ్వబోనని శపథం చేశారు. రేపో మాపో పార్టీ మారేందుకు రాజకీయ దిగ్గజం తుమ్మల నాగేశ్వరరావు సన్నద్ధమవుతున్నారు. తనతోపాటు పలువురు నేతలు, భారీగా కార్యకర్తల్ని తీసుకెళ్లేందుకు యత్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా భారాస ముఖ్యనేతల్లో మాత్రం సమన్వయలేమి స్పష్టంగా కనిపిస్తోంది. అభ్యర్థుల ప్రకటన తర్వాత ఇతర జిల్లాల్లో పార్టీపరంగా ఎన్నికల సన్నాహక కార్యక్రమాలు, నియోజకవర్గాల వారీగా సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ.. ఉభయ జిల్లాల్లో మాత్రం ఆదిశగా అడుగులు పడటం లేదని ఆపార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుదరని 'సమన్వయం'

నాయకుల మధ్య సమన్వయలేమి గులాబీ పార్టీకి ఇబ్బందికరంగా మారుతుండగా.. ఇటీవల ఎన్నికల సమన్వయకర్తల నియామకం అగ్గి రాజేస్తోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉభయ జిల్లాల్లోని శాసనసభ స్థానాలకు ఎన్నికల ఇన్‌ఛార్జిలను భారాస నియమించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని ఒక్కో నియోజకవర్గంలో తమకు ఇన్‌ఛార్జిలు అవసరం లేదని నేతలు తేల్చిచెప్పడంతో అక్కడ నియమించలేదు. మరో రెండు నియోజకవర్గాలకు నియమించిన ఇన్‌ఛార్జిలు తమకు వద్దని ఎమ్మెల్యేలు అధిష్ఠానం వద్ద మొరపెట్టుకుని మరీ తీసేయించారు. భద్రాచలం నియోజకవర్గానికి నియమించిన ఇన్‌ఛార్జిని తొలగించి.. గతంలో ఉన్న నాయకుడికే మళ్లీ బాధ్యతలు ఇవ్వాలంటూ అక్కడి నాయకులు పట్టుబడుతున్నారు. అందుకే భద్రాచలంలో ఎన్నికల సన్నాహక సమావేశం వాయిదా పడింది. కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఎంపీ వద్దిరాజు రవిచంద్రను నియమించగా.. జరిగిన సన్నాహక సమావేశానికి ఎంపీ నామా, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, భారాస జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. అదేరోజు వ్యక్తిగత పనులు ఉన్నాయంటూ ముగ్గురు నేతలు డుమ్మా కొట్టారు. ఇందుకు సమన్వయలేమి ప్రధాన కారణమన్నది భారాస వర్గాల్లో సాగుతున్న చర్చ. అభ్యర్థుల ప్రకటన తర్వాత కొన్ని నియోజకవర్గాల్లో చెలరేగిన అసమ్మతి జ్వాలలు ఇంకా చల్లారలేదు. అసంతృప్తుల్ని బుజ్జగించి.. కార్యకర్తల్లో సమరోత్సాహం నింపేందుకు నేతలు జోక్యం చేసుకోకపోవటం పార్టీలో పరిస్థితులకు అద్దం పడుతోందని పలువురు గులాబీ నాయకులు బహిరంగంగా వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం.

# వాహనాల కొరత.. పేరుకుపోతున్న చెత్త

తొర్రూరు : జిల్లాలో ఏకైక రెవెన్యూ డివిజన్ కేంద్రమైన తొర్రూరులో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వర్షాలు కురుస్తున్న తరుణంలో చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలో ఇంటింటికీ చెత్త సేకరణ 4 నుంచి 7 రోజులకోసారి జరగడం, మురుగు కాలువలను 15 రోజులకోసారి శుభ్రం చేయడం, కాలువల నుంచి తొలగించిన చెత్తను 3 నుంచి 5 రోజుల్లో తరలిస్తుండంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో ప్రజలు చెత్తా, చెదారాన్ని రహదారుల పక్కన, మురుగు కాలువల్లో పారబోస్తుండడంతో పరిసరాలు కలుషితమవుతున్నాయి. చెత్తసేకరణ కోసం కొనుగోలు చేసిన వాహనాలను మూలన పడేశారు.

పరిస్థితి ఇలా..

చెత్త సేకరణ కోసం మూడేళ్ల క్రితం 5 ఎలక్ట్రికల్ వాహనాలను కొనుగోలు చేశారు. అవి ఆర్నెల్ల పాటు పని చేశాయి. బ్యాటరీ సమస్య, డంపింగ్ యార్డు ఎత్తులో ఉండండంతో పైకి వెళ్లలేక వాహనాలు మరమ్మతుకు గురయ్యాయి. దీంతో వీటిని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిరుపయోగంగా వదిలేశారు. తర్వాత మరో 4 పెద్ద వాహనాలను కొనుగోలు చేశారు. వాటిలో ఒక వాహనాన్ని కుక్కలను తరలించేందుకు వాడుతున్నారు. మరొకటి పాడైపోవడంతో ఖమ్మంలోని మరమ్మతు కేంద్రానికి తరలించారు. మిగిలిన రెండు వాహనాలతో మాత్రమే ప్రస్తుతం తొర్రూరులోని 16 వార్డుల్లో చెత్తను సేకరిస్తున్నారు. వీటిలోనూ అడపాదడపా చనిపోయిన మూగజీవాలను తరలించడం, హరితహారం మొక్కలను తీసుకెళ్లడం తదితర పనులు చేస్తున్నారు. వీటితోపాటు 3 ట్రాక్టర్లు ఉన్నాయి. వీటిని ప్రధాన రహదారుల్లోని మురుగుకాల్వల నుంచి తొలగించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలి




ంచేందుకు వాడుతున్నారు. చిన్నచిన్న సందుల్లోకి ట్రాక్టర్‌లు వెళ్లకపోవడంతో అ కాలనీల్లో చెత్త సేకరణకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి.

కనిపించని మూడు రంగుల డబ్బాలు

గతంలో డివిజన్ కేంద్రంలోని 20 ప్రధాన కూడళ్లలో నీలం, ఆకుపచ్చ, ఎరువు రంగు కలిగిన 3 రంగుల చెత్తడబ్బాలను ఒక్కో స్టాండ్‌కు 3 చొప్పున ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి పట్టణంలో ఎక్కడా కనిపించడం లేదు. దీంతో పలు కూడళ్లు చెత్త నిలయాలుగా మారిపోయాయి. కేవలం ప్రధాన రోడ్లపైనే ప్రతి రోజూ ట్రాక్టర్లతో చెత్తను తరలించి పట్టణంలో ఇంటింటి చెత్త సేకరణను విస్మరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందికి సూచించినా పట్టించుకోవడం లేదని పలు కాలనీల ప్రజలు వాపోతున్నారు.

త్వరగా కొనుగోలు చేస్తాం– ఎం.రామచంద్రయ్య, మున్సిపల్ ఛైర్మన్, తొర్రూరుపట్టణంలో ఇంటింటి చెత్త సేకరణకు వాహనాల కొరత ఉన్న విషయం వాస్తవమే. గతంలో కొనుగోలు చేసిన 5 ఎలక్ట్రికల్ వాహనాలు మూలన పడ్డాయి. ప్రస్తుతం ఉన్న రెండు వాహనాలతో పాటు ట్రాక్టర్‌లతో చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నాం. మున్సిపాలిటీకి కేటాయించిన రూ. 25 కోట్లలో రహదారులను శుభ్రం చేసే యంత్రంతో పాటు మూడు ట్రాక్టర్‌లు, మరో రెండు ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించే వాహనాలను కొనుగోలు చేయాలని తీర్మానం చేశాం. సాధ్యమైనంత తొందరగా వాహనాలను కొనుగోలు చేసి సమస్యను పరిష్కరిస్తాం.

# సమస్యలు నిత్యకృత్యం.. పరిష్కారంలో నిర్లక్ష్యం!

తొర్రూరు : అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో పాలన గాడితప్పింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, క్షేత్రస్థాయిలో పట్టింపు లేకపోవడంతో.. పల్లెలు సమస్యల వలయంలో చిక్కుకుంటున్నాయి. వెంకటాపురం మండలం గొల్లగూడెం గ్రామస్థులకు సమస్యలు శాపంగా మారాయి. భరించలేని దుర్గంధం, చిత్తడిగా మారిన బురద రోడ్లు, అసంపూర్తి పనులు వ్యాధులకు ఊతమిస్తోంది. సమస్యలు నిత్యకృత్యంగా కళ్లెదుటే సాక్షాత్కరిస్తున్నా.. పరిష్కార మార్గానికి మోక్షం లేకుండా పోయింది.దోమలకు నిలయంగా..గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడనే తిష్ట వేశాయి. వానాకాలంలో చేపట్టాల్సిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టక పోవడంతో.. 14 వీధుల్లోని స్థానికులను దుర్గంధం వెంటాడుతోంది. నివాసాల చెంతనే మురుగునీరు పేరుకుపోయి దోమలకు నిలయంగా మారుతున్నా.. పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్య లోపం తాండవి స్తున్నా.. పాలకవర్గం, అధికారుల చర్యలు శూన్యం.

బురద రోడ్లపైనే రాకపోకలు

క్షేత్రస్థాయిలో ప్రణాళిక లేకపోవడంతో రహదారులు బురదమయంగా మారాయి. ఏ వీధికి వెళ్లినా.. చిత్తడి రోడ్లు దర్శనమిస్తున్నాయి. మోస్తరు వర్షానికే అధ్వాన్నంగా తయారై నడవలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి సిమెంట్ రోడ్లు నిర్మించినా.. ఆనవాళు లేకుండా పోయాయి. ఆ దారులన్నీ.. బురదతో నిండుకుని ఉన్నాయి. ద్విచక్రవాహనంపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. డ్రైనేజీలు సైతం పూడికతో నిండినా.. పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది.

అసంపూర్తి పనులతో అవస్థలు

పంచాయతీ నిధులు ఖర్చుచేసినా.. ప్రయోజనం లేకుండా పోయింది. మిషన్ భగీరథ నీటి పథకం వృథా నీటిని మళ్లించే పనులను అధికారులు ఇష్టారాజ్యంగా చేపట్టారు. పూర్వపు రహదారిని తవ్వి పైపులను పరిచి, అసంపూర్తిగానే చేతులెత్తేశారు. ఓ వీధిని ముంచెత్తుతున్న వర్షం నీటిని మళ్లించేందుకు సిమెంట్ గొట్టాలను పైపైనే ఏర్పాటు చేయడంతో.. ఆ మార్గంలో రాకపోకలు కష్టంగానే సాగుతున్నాయి. రోడ్లపై కందకాలు తవ్వి పూడ్చకపోవడం, ఆ పనుల్లో బాధ్యతారాహిత్యంగా చేపట్టడంతో తాగునీటి పైపులు ఛిద్రమైనా చోద్యం చూస్తున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు

– గడ్డం రామక్కఇళ్ల పక్కన మురుగునీరు చేరడంతో దోమల వ్యాప్తి అధికంగా ఉంది. పగలు రాత్రి లేకుండా దోమలు విజృంభిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీంతో జ్వరాల బారిన పడుతున్నాం. అష్టకష్టాలు పడుతున్నాం..– జి.దుర్గచక్కగా ఉన్న రోడ్డును యంత్రాలతో తవ్వి పాడు చేశారు. ఎక్కడికక్కడ నీళ్లు నిలిచి రాకపోకలకు కష్టంగా మారింది. తట్టెడుమట్టి పోసి పూడ్చడం లేదు. ప్రధాన మార్గానికి రావాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. వృద్ధుల జారిపడుతున్నా.. పట్టించుకోవడంలేదు.

# నిబంధనలకు నీళ్లు.. తరచూ ప్రమాదాలు

పాలకుర్తి : జిల్లాలోని పలు మండలాల్లో ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల చోదకులు రహదారి భద్రతా నిబంధనలు పాటించడం లేదు. వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ప్రైవేటు వాహనాలే దిక్కవుతున్నాయి.

సురక్షిత ప్రయాణమేదీ!

నిత్యం ఎక్కడో ఒకచోట ప్రైవేటు వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోతుండగా మరికొందరు గాయాలపాలవుతున్నారు. పలు ఘటనల్లో ఆటోవాలాల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమవుతోంది. పాలకుర్తి మండలంలోని కొన్ని గ్రామాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు లేకపోవడంతోనే ప్రజలు ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు ఈ ప్రాంతాలకు బస్సులను నడపాల్సి ఉంది. అలాగే రహదారి భద్రతా నిబంధనలు పాటించేలా ఆటోల చోదకులకు అవగాహన కల్పించాల్సి ఉంది.



గతంలో జరిగిన ఘటనలు రెండు నెలల క్రితం పాలకుర్తి మండలం వావిలాల శివారులో మలుపు వద్ద టిప్పర్, ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్రవాహనచోదకుడికి తీవ్ర గాయాలు కాగా.. వెనుక కూర్చున్న యువతి ప్రాణాలు కోల్పోయింది. ఈ ప్రమాదానికి కారణం మూలమలుపే. ఇలాంటి మలుపులు పాలకుర్తి మండలంలో చాలా ఉన్నాయి. మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వల్మిడి, ముత్తారం గ్రామాల్లో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. లింగాలఘనపురం మండలం నెల్లుట్ల శివారులో ఇటీవల ఆటో ప్రమాదానికి గురికాగా నలుగురికి గాయాలయ్యాయి. చోదకుడి ఏమరుపాటు వల్లే ప్రమాదం జరిగింది. కుందారం శివారులో చోదకుడి నిర్లక్ష్యంతో కూలీలతో వెళున్న ఆటో ప్రమాదానికి గురైంది. పలువురు కూలీలు గాయపడ్డారు. దేవరుప్పుల మండలంలో నిలిచి ఉన్న వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.

పాటించాల్సిన నిబంధనలివి.. ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదు. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. వాహనాలను ఇష్టానుసారంగా రహదారుల వెంట నిలపొద్దు. పాఠశాల బస్సుల డ్రైవర్లు వేగ పరిమితి నిబంధన పాటించాలి. తల్లిదండ్రులు ఆటోల్లో వెళ్లే విద్యార్థుల సంఖ్యను గమనించాలి. డ్రైవర్ సీటులో ఎవరినీ కూర్చొనివ్వకూడదు.

# గుప్పుమంటున్న గంజాయి!!

పాలకుర్తి : ఇటీవల హనుమకొండ నుంచి ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై కరుణాపురం వైపు వెళ్తున్నారు. ఎదురుగా మరో వాహనం వచ్చి ఢీకొట్టడంతో కిందపడ్డారు. వారి వద్ద ఉన్న సంచిలో నుంచి గంజాయి పొట్లాలు బయటపడ్డాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మార్గంలోని అంబాల సమీపంలో గంజాయి తాగుతున్న నలుగురు ఇంజినీరింగ్, ఇద్దరు డిగ్రీ, ఐటీఐ విదార్థులు, ఓ కారు డ్రైవర్ పోలీసులకు చిక్కారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకొని రిమాండుకు పంపారు. హనుమకొండలోని ఓ ప్రాంతానికి చెందిన యువకుడు రోజూ గంజాయి తాగి ఇంటికొచ్చి తల్లిదండ్రులను నానా గోసపెడుతున్నాడు. డబ్బులు కావాలంటూ వారిని వేధిస్తున్నాడు. ఈ విషయం ఎవరికీ



చెప్పుకోలేక లోలోపల బాధ పడుతున్నారు. జిల్లాలో గంజాయి గుప్పుమంటోంది. గుట్టుగా రవాణా అవుతోంది. పల్లెల్లో యువకులు కొందరు మత్తుకు బానిసలుగా మారారు. జయశంకర్, ములుగు జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో అంతర పంటగా సాగు చేసి.. అక్రమంగా తీసుకొస్తున్నారు. రహస్య ప్రాంతాల్లో ఎండబెడుతున్నారు. ఈ తర్వాత వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. గంజాయి పీల్చడానికి అలవాటు పడి గ'మ్మత్తు'లో ఊగుతున్నారు.

కమలాపూర్ మండలంలో హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో చాలా మంది గంజాయికి అలవాటుపడ్డారు. గ్రామాల్లో గంజాయి బాగా నడుస్తోందని, దీన్ని నిరోధించాలని ఇటీవల ఉప్పల్‌కు వచ్చిన సీపీ రంగనాథ్ ఓ పోలీసు అధికారికి సూచించారు. యథేచ్ఛగా సాగుతున్నా పోలీసులు పట్టుకోవడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పొట్లాల్లో చుట్టి ప్రత్యేకించిన పేర్లతో, కోడ్ భాషతో పిలుస్తూ అనుకున్న చోటుకి చేరవేస్తున్నారు. యువకుల బానిసత్వాన్ని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా దందాను సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు గంజాయి అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపి, యువత పెడదారి పట్టకుండా నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కోడ్ బాషతో విక్రయాలు

గంజాయి పొట్లాలను పలు రవాణా సాధనాల ద్వారా మహారాష్ట్ర, ముంబయి, బల్లార్షా తదితర ప్రాంతాలకు రహస్యంగా చేరవేస్తున్నారు. చరవాణుల్లో ప్రత్యేకమైన కోడ్ భాషతో సంక్షిప్త సందేశాలు పంపి వాటి ఆధారంగా అనుకున్న చోటుకు వెళ్తుంటారు. ఇద్దరు ద్విచక్ర వాహనంపై వచ్చి రహస్యంగా సరకు చేరవేసి వెళ్లిపోతారు. అక్రమార్కులు రాత్రి వేళ చిరు వ్యాపారులుగా, యాచకులుగా మారి వీటిని తీసుకెళ్తున్నట్లు సమాచారం. జిల్లాలో నిర్వహిస్తున్న ఈ వ్యాపారానికి అడ్డుకట్ట వేయకపోతే మంచి భవిష్యత్తు ఉన్న యువకులు మత్తు రొంపిలోకి దిగి వారి జీవితాలను నాశనం చేసుకునే అవకాశముంది.

2022లో నమోదైన కేసులు: 80 పట్టుకున్న గంజాయి: 1250 కేజీలు విలువ : సుమారు రూ. 1.25 కోట్లు

# నాడు మురికికూపం.. నేడు సుందర రూపం



ఖమ్మం: మురికి కూపంగా మారి ఖమ్మంవాసులను దశాబ్దాలుగా పట్టి పీడించిన గోళ్లపాడు ఛానల్.. ఇప్పుడు నగర సిగలో మరో మణిహారంగా మారింది. కాల్వకు రెండువైపులా ఆక్రమణలు, చెత్తాచెదారంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లిన గోళ్లపాడు కాల్వ.. ఆధునికీకరణ పేరిట ముగ్ధ మనోహరంగా తయారైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ కేటాయించిన ప్రత్యేక నిధులు రూ.100 కోట్లతో నగరానికే వన్నె తెచ్చేలా గోళ్లపాడు ఛానల్ నిలుస్తోంది.

కట్టిపడేసే ఆహ్లాదం..ఆహ్లాదం, అందమైన ఫౌంటెయిన్లు, పచ్చదనంతో 10.6 కి.మీ. పొడవైన గోళ్లపాడు ఛానల్ పరిఢవిల్లుతోంది. ఈ కాల్వ పొడవునా భూగర్భంలో ప్రత్యేకంగా మురుగునీటి వ్యవస్థ, పైన సుందరీకరణ పనులు చేపట్టారు. చిన్నారుల ఆటవిడుపు కోసం క్రీడా ప్రాంగణాలు, పార్కులు ఏర్పాటు చేశారు. కాల్వపై మొత్తం పది పార్కులు నిర్మించారు. వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, వాల్ ప్రాజెక్టులు, ఆక్యుపంక్చర్ పార్కులు, పదుల సంఖ్యలో పట్టణ ప్రకృతి వనాలు వెలిశాయి. వివిధ రకాలైన 5 వేల మొక్కలు నాటారు. షటిల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులను అందుబాటులోకి తెచ్చారు. అన్నిచోట్లా మొబైల్ టాయ్‌లెట్స్ ఉన్నాయి. రాత్రిపూట ఎల్ఈడీల వెలుగులతో గోళ్లపాడు ఛానల్ సరికొత్త అందాలు సంతరించుకుంటోంది. ఈ ఛానల్‌పై నిర్మించిన పార్కులకు వైతాళికుల పేర్లు పెట్టడం మరో విశేషం. ప్రొ.జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, కాళోజీ, పుచ్చలపల్లి సుందరయ్య, పద్మశ్రీ వనజీవి రామయ్య, మహ్మద్ రజబ్ అలీ, మంచికంటి రామకిషన్‌రావుల నామకరణం చేశారు.

చెస్ పార్కు, స్కేటింగ్ రింక్ అదరహో..రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా గోళ్లపాడు ఛానల్‌పై ఏర్పాటుచేసిన చెస్ పార్కు, అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన స్కేటింగ్ రింక్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రష్యాలో మాదిరిగా ప్రత్యేక పరిజ్ఞానంతో రూపొందించిన చెస్ పార్కు అబ్బురపరుస్తోంది.

పంజాబ్ నుంచి చెస్ కాయిన్స్ తెప్పించారు. కలెక్టర్ వీపీ గౌతమ్ ఆలోచనల నుంచి పుట్టిన ఈ చెస్ పార్కు నిర్మాణంలో ఎక్కడా రాజీ పడలేదు. రాష్ట్రంలోనే తొలి చెస్ పార్కుగా కితాబు అందుకుంటోంది. సుందరయ్య పార్కులో రూపొందించిన స్కేటింగ్ రింక్ ఆకట్టుకుంటోంది. 130 మీటర్ల పొడవుతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేశారు. ఇక్కడ పిల్లలకు స్కేటింగ్ పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# సహకార రంగానికి పూర్వవైభవం



ఖమ్మం : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)ను పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రతి గ్రామపంచాయతీలో పీఏసీఎస్, పాడి సహకార సంఘం, మత్స్య సహకార సంఘాల ఏర్పాటుకు కేంద్ర మంత్రిమండలి ఇటీవల ఆమోదం తెలిపింది. కార్యరూపం దాల్చితే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోనూ సంఘాల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది.

నానాటికీ తగ్గిన సంఘాల సంఖ్య

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1987కు ముందు సుమారు 300 వరకు సహకార సంఘాలుండేవి. ఆతర్వాత వీటి సంఖ్య 209కు తగ్గింది. వైద్యనాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు నష్టాల్లో కూరుకుపోయిన సంఘాలను లాభాల బాటలో పయనిస్తున్న వాటిలో కలిపారు. 1995 తర్వాత వీటి సంఖ్య 107కు చేరింది. రాష్ట్ర విభజన అనంతరం ఐదు సంఘాలు ఏపీలో కలిశాయి. మిగిలిన వాటిలో ఖమ్మం జిల్లాలో 77, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21, ములుగు, మహబూబాబాద్‌లో 2 చొప్పున ఉన్నాయి. పాడి సహకార సంఘాలు 75, మత్స్య సహకార సంఘాలు 177 వరకు ఉన్నాయి.

అరకొరగానే సేవలు

గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాలు రైతులకు విస్తృతంగా సేవలందించాయి. వాటి సంఖ్య తగ్గటంతో రైతులకు అరకొరగా సేవలందుతున్నాయి. ఒకప్పుడు ఐదు సహకార సంఘాలున్న ఏన్కూరు మండలంలో ప్రస్తుతం గార్లొడ్డు సంఘం ఒక్కటే ఉంది. 24 గ్రామపంచాయతీలు ఉన్న కొణిజర్ల మండలంలో గోపారం సంఘం ఒక్కటే దిక్కు. ఖమ్మం గ్రామీణ మండలంలో ఏదులాపురం, ఖమ్మం అర్బన్ మండలంలో టేకులపల్లి ఆంధ్రాబ్యాంకు కర్షక సేవా సమితి మాత్రమే మిగిలాయి. అనేక మండలాల్లో ఒకటి లేదా రెండు సంఘాలుండటం వల్ల రైతులు పంట రుణాలకు ఇతర బ్యాంకులు, వడ్డీ వ్యాపారులపై ఆధారపడుతున్నారు.

కొన్ని మండలాల్లో అత్యధికంగా..వైద్యనాథన్ కమిషన్ సూచనల ప్రకారం నష్టాల్లో కూరుకున్న సంఘాలను సమీపంలోని ఇతర వాటిలో కలిపారు. అప్పట్లో కొన్ని మండలాల్లోనే లాభాల్లో కొనసాగుతున్న సంఘాలు ఎక్కువగా ఉండటం విశేషం. ఎర్రుపాలెం, బోనకల్లు, నేలకొండపల్లి మండలాల్లో అత్యధికంగా తొమ్మిది చొప్పున ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం వల్ల మత్స్య, పాడి సహకార సంఘాలతో పాటు పీఏసీఎస్‌ల సంఖ్య పెరుగుతుంది. కొత్త సంఘాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి విధివిధానాలు రాలేదు. ప్రభుత్వ తాజా నిర్ణయం వల్ల జిల్లాలో సంఘాల సంఖ్య పెరిగే అవకాశముంది. విజయకుమారి, డీసీఓ, ఖమ్మం

# బకాయిలు దండి..వసూలు ఎలాగండి ?



ఖమ్మం : మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకు అనుసంధాన రుణాలను మంజూరు చేస్తోంది. వీటిని తీసుకున్న స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు వాటిని వివిధ వ్యాపారాలకు ఉపయోగించుకొని ప్రతినెలా తిరిగి వాయిదాల పద్ధతిలో బ్యాంకులకు చెల్లించాలి. అయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తిరిగి చెల్లింపుల విషయంలో కాస్త వెనుకబాటు కనిపిస్తోంది. రెండు జిల్లాలు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. రాష్ట్ర సరాసరి కన్నా ఈ రెండు జిల్లాల సరాసరి ఎక్కువగా ఉంటోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ అలసత్వం ఎక్కువగా కనిపిస్తోంది. స్వయం సహాయక సంఘాలు వరుసగా మూడు నెలల పాటు రుణాలను చెల్లించకపోతే ఎన్‌పీఏ(నాన్ పర్ఫామింగ్ ఎసెట్)గా పరిగణిస్తారు. వరుసగా ఆరు నెలలు మించి రుణాలను చెల్లించకపోతే ఆ సంఘాలను క్రానిక్ డిఫాల్ట్ సంఘాలు(మొండి బకాయిలు)గా పరిగణిస్తారు. ఇవి ఖమ్మం జిల్లాలో కన్నా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి. బకాయిల్లో రాష్ట్రంలోనే భద్రాద్రి జిల్లా 3వ స్థానంలో, ఖమ్మం జిల్లా 14వ స్థానంలో ఉన్నాయిౘ

వసూళ్లు ఎలాగో...

ప్రతినెలా రుణాలు తీసుకున్న మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించి వారిని చైతన్యం చేయాల్సి ఉంది. అయితే ఈ విషయంలో మండల ఏపీఎంలు, సీసీలు, గ్రామ దీపికలు తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం కూడా ఒక కారణంగా కనిపిస్తోంది. దీంతో పాటు కొన్ని గ్రామాల్లో గ్రామ దీపికలు చేస్తున్న అవకతవకల వల్ల సంఘాలు వీటిని చెల్లించడం లేదు. ఫలితంగా రాష్ట్రస్థాయిలో మొండి బకాయిల విషయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ముందు వరుసలో ఉండాల్సిన పరిస్థితి వచ్చింది.

బకాయిలు ఇలా..భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 16,038 సంఘాలు ఉండగా, వాటిలో 1,115 మొండి బకాయిలు పడ్డాయి. ఇవి రూ.29.76 కోట్లు చెల్లించాల్సి ఉంది. మూడు నెలల పాటు చెల్లించనివి 1,210 ఉన్నాయి. ఇవి రూ.31.82 కోట్లు చెల్లించాలి. ఇక క్రమం తప్పకుండా కట్టనివి 1,981 ఉన్నాయి.

ఖమ్మం జిల్లాలో మొత్తం 22,310 సంఘాలుండగా, వాటిలో 993 మొండి బకాయిలు పడ్డట్టు గుర్తించారు.. అవి రూ.20.50 కోట్లు చెల్లించాల్సి ఉంది. మూడు నెలల పాటు చెల్లించనివి 1,194 ఉండగా, రూ.25.56 కోట్లు చెల్లించాలి. ఇక క్రమం తప్పకుండా చెల్లించనివి ఏకంగా 3,408 ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో ఎన్‌పీఏ 2.16 శాతం ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 5.13 శాతం, ఖమ్మం జిల్లా 2.49 శాతం ఉన్నాయి. ఇది ఉమ్మడి జిల్లాలో సెర్ప్ సిబ్బంది నిర్లక్ష్య పనితీరుకు నిదర్శనం.

# బతుకు రక్షణకు.. ఏదీ ఉపాధి శిక్షణ

సూర్యాపేట :పురపాలికల్లో మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధిలో రాణించేందుకు గతంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) కృషి చేసేది. మగువలకు ఇష్టమైన రంగంలో శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధి పొందేందుకు జీవనోపాధుల మిషన్‌లో భాగంగా వారికి వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో 2019లో నిలిచిన శిక్షణలను మళ్లీ ప్రారంభించలేదు. వ్యాపారం కోసం కొందరు మహిళలు రుణాలు తీసుకుంటున్నా సరైన అవగాహన లేక సొంతానికి వినియోగించుకుంటున్నారు.

వృత్తి శిక్షణ లేక ఇక్కట్లు

జిల్లాలోని ఐదు పురపాలికల్లో 4,965 మహిళా స్వయం సహాయక సంఘా(ఎస్‌హెచ్‌జీ)లు ఉన్నాయి. వాటిల్లో 49,650 మంది సభ్యులుగా ఉన్నారు. గతంలో వివిధ ఏజెన్సీలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా పలు



రంగాల్లో వృత్తి నైపుణ్యాలపై ఎస్‌హెచ్‌జీ సభ్యులకు తర్ఫీదు ఇచ్చేవారు. తర్వాత వారు ఆయా వృత్తి పనులు చేస్తూ ఉపాధి పొందేవారు. అతివలకు కుట్టు మిషన్, ఎంబ్రాయిడరీ, మగ్గం, అల్లికలు, అగరువత్తుల తయారీ, చాక్‌పీసులు, పేపర్ ప్లేట్లు, ఫినాయిల్, జనపనార బ్యాగులు, సబ్బులు, కొవ్వొత్తుల తయారీపై నెల నుంచి మూడు నెలలపాటు ఉచితంగా తర్ఫీదు ఇచ్చేవారు. అనంతరం బ్యాంకుల నుంచి ఉచితంగా రుణాలు ఇప్పించి వ్యాపారం చేసేలా ప్రోత్సహించేవారు. మూడేళ్ల నుంచి మెప్మా ఆధ్వర్యంలో జీవనోపాధుల మిషన్ నుంచి ఎలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం లేదు. కొన్ని సంస్థలు ముందుకొస్తున్నా.. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు లేవన్న కారణంతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. ప్రణాళిక రూపొందిస్తున్నాం–రమేశ్ నాయక్, మెప్మా పీడీ, సూర్యాపేట చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు శిక్షణ ఇప్పించేందుకు ప్రణాళిక తయారు చేశాం. ఇప్పటి వరకు జిల్లాలో 92 మంది మహిళా సంఘాల సభ్యులను గుర్తించాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు కూడా నివేదిస్తాం. వారి నుంచి ఆదేశాలు రాగానే అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

# అన్నదాతకు మరింత అండగా..!

నల్గొండ : దేశంలో రాబోయే ఐదేళ్లలో రెండు లక్షల నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉమ్మడి నల్గొండ జిల్లాలోనూ మరిన్ని సంఘాలు ఏర్పాటయ్యే అవకాశముంది. గ్రామానికో సంఘం ఏర్పాటు చేసి రైతులకు 25 రకాల సేవలు అందించేలా చేయాలనేది కేంద్ర ప్రభుత్వ ఆలోచన. ప్రస్తుతం గ్రామాల వారీగా జనాభా, సాగు విస్తీర్ణం, రైతుల సంఖ్య, తదితర వివరాల సేకరణపై అధికారులు దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఉన్న సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నాబార్డు ద్వారా రుణాలు అందిస్తోంది. విత్తు నుంచి మొదలుకొని రైతులు పండించిన పంటను కొనుగోలు చేసే వరకు రైతులకు సేవలు అందించేలా సంఘాలు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. జిల్లాల విభజనకు ముందు అవసరాన్ని బట్టి అప్పట్లో ఒక్కో మండలంలో మూడు, నాలుగు సంఘాలు ఏర్పాటు చేసుకోగా, కొన్ని మండలాల్లో అసలు సంఘాలే లేవు. జిల్లాల విభజన తర్వాత కొత్త సంఘాలు ఏర్పాటు కాలేదు.

అన్నదాతలకు అండగా..జిల్లాలోని కొన్ని గ్రామాలను కలిపి సహకార సంఘాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో 107 సంఘాలు ఉండగా.. 2,78,683 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో కొన్ని నామమాత్రంగా ఉండగా, మరి కొన్ని సంఘాలు రైతుల అవసరాలకు ప్రాధాన్యమిచ్చి ఆదర్శంగా నిలుస్తున్నాయి. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాల పంపిణీతో పాటు పంట రుణాలు ఇవ్వడం, వారి నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నాయి. సంఘాల పరిధిలో సేవలను పొందాలంటే సహకార సంఘాలో రైతులు సభ్యత్వం తీసుకోవాలి. ప్రస్తుతం రూ.300తో పాటు ప్రవేశ రుసుం రూ.30 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే, సభ్యత్వంతో పాటు ఓటు హక్కు లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు కొత్తగా ఏర్పాటయే సంఘాలకు సంబంధించిన మార్గదర్శకాలు వస్తే నిబంధనల్లో మార్పు ఉండే అవకాశం ఉంది.

వ్యాపారంతో అభివృద్ధి..

ఉమ్మడి జిల్లాలో కొన్ని సహకార సంఘాలు రైతులకు అనేక సేవలు అందించడంతో పాటు వ్యాపారంతో అభివృద్ధి చెందుతున్నాయి. గతంలో ఐసీడీఎస్ కింద, మరి కొన్ని సంఘాలు డీసీసీబీ సాయంతో సొంత భవనాలు, గోదాంలు నిర్మించుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో 107 సంఘాల్లో 65 సంఘాలకు సొంత భవనాలు ఉన్నాయి. లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించేందుకు బ్యాంకుల మాదిరిగా సంఘాల్లో కంప్యూటరీకరణ చేశారు. సంఘాల్లోని రైతుల ఖాతాలు, ఆదాయ, వ్యయాలు అన్‌లైన్‌లో నమోదు చేశారు. మరింత బలోపేతం చేసేందుకు నాబార్డుతో పాటు జిల్లా కేంద్రం సహకార బ్యాంకు నిధులు మంజూరు చేస్తుంది. భవిష్యత్తులో సేంద్రియ సాగు, రాయితీ విత్తనాలు, బిందు సేద్య పరికరాలు, ఆధునిక యంత్రాలు, భూసార పరీక్షలు, విత్తనశుద్ధి, విత్తనోత్పత్తి, పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు, నర్సరీలు, ఎరువుల తయారీ తదితర వాటిని సంఘాల ద్వారా రైతులకు అందించాలని కేంద్ర ప్రభుత్వ భావిస్తోంది.

మార్గదర్శకాలు రావాలి

– రాజశేఖర్‌రెడ్డి, సహకార శాఖ జిల్లా అధికారి, నల్గొండ

సంఘాలు ఎక్కువగా ఉంటే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది. నూతన సంఘాల ఏర్పాటుకు మార్గదర్శకాలు రాలేదు. సంఘాలను బలోపేతం చేసే దశగా పని చేస్తున్నాం.




# చంద్రబాబు అరెస్టుకు మూల్యం చెల్లించుకోక తప్పదు.. తెదేపా నేతల హెచ్చరిక

విజయవాడ: తెదేపా అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టు ముమ్మాటికి అప్రజాస్వామికమని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా దేవినేనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భవానీపురం పోలీసుస్టేషన్‌కు తరలించారు. అంతకుముందు ఆయన మాట్లాడారు. " రాష్ట్రంలో తెదేపా పార్టీ కార్యకర్తలే కాకుండా సామాన్య ప్రజలు చంద్రబాబు అరెస్టుపై ఆందోళన చెందుతున్నారు. కేవలం సీఎం జగన్ రెడ్డి కళ్లలో ఆనందం కోసమే పోలీసు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారి ఇలా వేలాది మంది పోలీసులతో తెదేపా నాయకులను నిర్బంధిస్తున్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ప్రజా తిరుగుబాటు తప్పదు. తాడేపల్లిలోని సజ్జల పర్యవేక్షణలోనే ఈ అక్రమ గృహ నిర్బంధాలు, అరెస్టులు జరుగుతున్నాయి" అని విమర్శించారు.

**అరెస్టు చేసిన విధానం అత్యంత దారుణం: కనకమేడల –** చంద్రబాబు అరెస్టు ప్రజాస్వామ్యానికి దుర్దినమని తెదేపా ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అన్నారు. అరెస్టు చేసిన విధానం కూడా అత్యంత దారుణంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం చెబుతున్న అభియోగాలతో చంద్రబాబుకు ఎలాంటి ప్రమేయం లేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే అపహాస్యం చేస్తున్నారన్నారు.

**అచ్చెన్నాయుడి గృహనిర్బంధం..** చినవాల్తేరులో తెదేపా ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఆయనని ఎవరూ కలవకుండా పోలీసులు ఆంక్షలు విధించారు.

**పథకం ప్రకారమే చంద్రబాబు అరెస్టు: కన్నా –** తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టును ఆ పార్టీ నేత కన్నా లక్ష్మీనారాయణ తీవ్రంగా ఖండించారు. ఒక పథకం ప్రకారం చంద్రబాబును అరెస్టు చేశారని పేర్కొన్నారు. అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారని ఆరోపించారు.

ప్రతిపక్ష నేతను అరెస్టు చేసి జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు.

**జగన్ ఉన్మాదానికి పరాకాష్ఠ: కొల్లు రవీంద్ర –** చంద్రబాబు అరెస్టు ఉన్మాదానికి పరాకాష్ఠ అని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. రాష్ట్ర ప్రజలందరూ అక్రమ అరెస్టును ఖండిస్తూ తీవ్ర నిరసన తెలియజేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు మచ్చలేని మనిషి అని చెప్పారు. సంబంధం లేని విషయంలో అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. న్యాయం కోసం పోరాటం చేస్తామని, నీతి నిజాయతీతో చంద్రబాబు బయటకు వస్తారని పేర్కొన్నారు. సుమారు 16 నెలలు జైల్లో ఉన్న వ్యక్తి, 32 కేసుల్లో ప్రథమ ముద్దాయిగా ఉన్న వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటే ఇదే విధంగా జరుగుతుందని ఎద్దేవా చేశారు.

**ఏపీలో ఎమర్జెన్సీని మించిన పరిస్థితి : ప్రత్తిపాటి –** ఆంధ్రప్రదేశ్‌లో ఎమర్జెన్సీని మించిన పరిస్థితులు ఉన్నాయని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టుతో జగన్ అన్ని హద్దులు దాటేశారని మండిపడ్డారు. నిరంకుశత్వం మితిమీరినప్పుడు తిరుగుబాటు అనివార్యం అవుతుందన్నారు. జగన్ నిరంకుశ చర్యకు ప్రజాకోర్టులో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.




**కక్ష సాధింపులో భాగంగానే చంద్రబాబును అరెస్టు చేశారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపించారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అరెస్టును ఖండించడంతోపాటు.. ఆయనకు మద్దతు తెలిపారు.**




మంగళగిరి: తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టుపై ఏపీ సీఐడీ చీఫ్ ఎన్ సంజయ్ స్పందించారు. నంద్యాలలో ఉదయం 6 గంటలకు చంద్రబాబును అరెస్టు చేసినట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆయణ్ని ప్రధాన నిందితుడిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళగిరిలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఐడీ చీఫ్ ఎన్ సంజయ్ మాట్లాడారు.

**గంటాకు 4 పదవులు..** "స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటులో కుంభకోణం జరిగింది. ఇందులో రూ.550 కోట్ల మేర అక్రమాలు జరిగాయని గుర్తించాం. ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన రూ.371 కోట్లు.. డిజైన్ టెక్ సహా ఇతర షెల్ కంపెనీలకు వెళ్లినట్టు తేలింది. సీమెన్స్ తరఫున డిజైన్ టెక్ అనే సంస్థ ద్వారా లావాదేవీలు జరిగాయి. ఒప్పందం జరిగే సమయానికి డిజైన్ టెక్ అనే సంస్థ లేదు.

ఏపీ స్కిల్ డెవలవ్‌మెంట్ కార్పొరేషన్‌లో గంటా సుబ్బారావుకు 4 పదవులు ఇచ్చారు.

**లోకేశ్ పాత్రపై దర్యాప్తు :** స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో షెల్ కంపెనీల ద్వారా అక్రమాలకు పాల్పడిన వ్యవహారంలో మాజీ సీఎం చంద్రబాబు ప్రధాన కుట్రదారు. వికాస్ కన్వేల్కర్ సహా ఇతర నిందితులు ఈ అక్రమాల్లో నిందితులుగా ఉన్నారు. ఈ కేసుల్లో చంద్రబాబును కస్టడీలోకి తీసుకుని విచారణ చేయాల్సిన అవసరం ఉంది. ఈ ఆర్థిక కుంభకోణంలో అప్పటి కార్యదర్శితో పాటు చంద్రబాబు తనయుడి పాత్ర పైనా దర్యాప్తు జరుగుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న చంద్రబాబు సాక్ష్యాలను మాయం చేసే అవకాశం ఉంది అందుకే ఆయన అరెస్టు అనివార్యం అయ్యింది

**కేబినెట్ ఆమోదం కూడా లేదు :** సిమెన్స్ సంస్థ నుంచి రూ.550 కోట్లు పెట్టుబడి వస్తుందని పేర్కొంటూ ప్రభుత్వం జీవోల ద్వారా రూ.371 కోట్లు ఇచ్చేశారు. దీనికి కేబినెట్ ఆమోదం కూడా లేదు. రూ.540 కోట్ల వ్యయం అయ్యే 6 సెంటర్ ఆఫ్ ఎక్‌లెన్స్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఒప్పందం చేసుకున్నారు. రూ.3 వేల కోట్లతో అన్ని కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రూ.58 కోట్లతో సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేశారు. దాన్నే బాగా పెంచి చూపించి కుట్రకు పాల్పడ్డారు. డిజైన్ టెక్‌కు చెందిన మనోజ్ పర్ధాసాని, అలాగే చంద్రబాబు కార్యదర్శి శ్రీనివాస్ కూడా పరారీలో ఉన్నారు.

**దుబాయి, అమెరికాకు వెళ్తున్నాం :** ఈ కేసుకు సంబంధించి సీఐడీ బృందాలు దుబాయి, అమెరికాకు వెళ్తున్నాయి. ఈ కేసులో రాజేశ్, నారా లోకేశ్ పాత్రలు ఎంత ఉన్నాయన్నది తేలుస్తాం. ఏపీ ఫైబర్ నెట్‌తో పాటు ఇన్నర్ రింగ్ రోడ్ అక్రమాల కేసులో లోకేశ్ పాత్రపైనా విచారణ చేస్తాం. ఇవాళ విజయవాడ ఏసీబీ కోర్టులో చంద్రబాబును హాజరు పరుస్తాం. ఆయణ్ని విజయవాడకు తీసుకురావడానికి హెలికాప్టర్ సిద్ధం చేశాం.. అయితే దాన్ని ఆయన వద్దన్నారు. ఆయన వయసు దృష్ట్యా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. స్కిల్ డెవలపెంట్ కేసులో అంతిమ లబ్ధిదారు చంద్రబాబే. ఆయన కీలక పాత్రధారి కాబట్టే అరెస్టు చేశాం" అని సీఐడీ చీఫ్ వివరించారు.




నంద్యాల: మాజీ ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబును పోలీసులు అరెస్టు చేశారు. తొలుత నంద్యాలలోని ఆర్.కె.ఫంక్షన్ హాల్ వద్ద ఆయన బస చేసిన బస్సు వద్దకు పోలీసులు చేరుకున్నారు. ఆయనతో మాట్లాడి అదుపులోకి తీసుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించి చంద్రబాబును అరెస్టు చేసినట్లు సీఐడీ పోలీసులు తెలిపారు.

వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం.. ఆయన కాన్వాయ్‌లోనే ఎన్ఎస్‌జీ భద్రతతో విజయవాడ తరలిస్తున్నట్లు తెలిపారు. అరెస్టుకు సంబంధించిన పత్రాలపై చంద్రబాబు సంతకం చేశారు. విజయవాడలోని ఏసీబీ కోర్టులో చంద్రబాబును హాజరుపరిచే అవకాశం ఉంది.

**చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి బాగోలేదు :** చంద్రబాబు అరెస్టుపై ఆయన తరఫు న్యాయవాది స్పందించారు.

"చంద్రబాబుకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యపరీక్షల్లో చంద్రబాబుకు హైబీపీ, షుగర్ ఉంది. చంద్రబాబుకు హైకోర్టులో బెయిల్‌కు ప్రయత్నం చేస్తున్నాం. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి బాగోలేదు. కేసుతో సంబంధం లేని సెక్షన్లు నమోదు చేశారు. స్కిల్ డెవలెప్‌మెంట్ కేసులో 37వ ముద్దాయిగా పేర్కొన్నారు" అని తెలిపారు.

**రాత్రంతా హైడ్రామా :** అంతకుముందు చంద్రబాబు బస చేసిన ఆర్.కె.ఫంక్షన్ హాల్ వద్ద తీవ్ర ఉత్కంఠ నెలకొంది. శుక్రవారం అర్ధరాత్రి దాటాక చంద్రబాబు బస చేస్తున్న ప్రదేశానికి అధికసంఖ్యలో పోలీసులు చేరుకున్నారు. అనంతపురం నుంచి పోలీసు బృందాలను నంద్యాలకు రప్పించారు. మొత్తం ఆరు బస్సుల్లో బలగాలు ఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్నాయి. డీఐజీ రఘురామరెడ్డి, జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మోహరించారు. ఎక్కడికక్కడ బారికేడ్లు, చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తెదేపా శ్రేణులు ఆర్.కె ఫంక్షన్ హాల్ వద్దకు భారీగా తరలివచ్చాయి. శనివారం ఉదయం 5 గంటల తర్వాత చంద్రబాబు బస చేస్తున్న వాహనం వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నారు. వాహనం చుట్టూ ఉన్న తెదేపా నేతలను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో కాలవ శ్రీనివాసులు, భూమా బ్రహ్మానందరెడ్డి, భూమా అఖిలప్రియ, జగత్ విఖ్యాత్‌రెడ్డి, ఎ.వి.సుబ్బారెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి తదితర స్థానిక తెదేపా నేతలు ఉన్నారు. బస చేసిన బస్సు నుంచి చంద్రబాబు కిందికి రావడంతో పోలీసులు ఆయనతో మాట్లాడి అదుపులోకి తీసుకున్నారు.




అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత చంద్రబాబు అరెస్టుపై సమాచారం ఇవ్వకపోవడం పట్ల ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ విస్మయం వ్యక్తం చేశారు.

అరెస్టు విషయంలో ప్రభుత్వ తీరుపై గవర్నర్ అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. అవినీతి నిరోధకర చట్టం–2018 సవరణల తర్వాత రాష్ట్రంలో ప్రజాప్రతినిధులు, అంతకుముందు మంత్రులుగా పనిచేసి వారు.. వారు నిర్వహించిన శాఖల్లో అవినీతి జరిగినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే వాటన్నింటినీ క్రోడీకరిస్తూ గవర్నర్‌కు నివేదిక సమర్పించాలి. ఆ తర్వాత గవర్నర్‌ను నుంచి అనుమతి తీసుకొని విచారణ చేపట్టాల్సి ఉంటుంది. కానీ, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టుపై రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టు అక్రమం, చట్ట విరుద్ధమని ఇప్పటికే సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు స్పష్టం చేశారు. గవర్నర్ అనుమతి లేకుండా చంద్రబాబును అరెస్టు చేయడం, దర్యాప్తు చేపట్టడం చట్టవిరుద్ధమని చెప్పారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఎ(సి) ప్రకారం గవర్నర్ అనుమతి తప్పనిసరని వెల్లడించారు. ఒకవేళ గవర్నర్ అనుమతి తీసుకుని ఉంటే.. ఆ పత్రాలు చూపించాల్సి ఉంటుందని నాగేశ్వరరావు తెలిపారు. గవర్నర్ అనుమతి లేకపోతే దర్యాప్తు చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. గవర్నర్ అనుమతి లేకుండా అదుపులోకి తీసుకుంటే.. అక్రమ నిర్బంధం అవుతుందని తెలిపారు. ఆ చర్యకు పాల్పడిన పోలీసు అధికారులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## చంద్రబాబు అరెస్ట్.. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదు: పురందేశ్వరి

అమరావతి: తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును భాజపా ఖండించింది. సరైన నోటీసు ఇవ్వకుండా ఆయన్ని అదుపులోకి తీసుకున్నారని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరు కూడా పేర్కొనలేదని తెలిపారు. కనీసం ఆయన నుంచి వివరణ కూడా తీసుకోలేదన్నారు. అరెస్టు సమయంలో సరైన విధానాలూ పాటించలేదని పేర్కొన్నారు. మాజీ



ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించి ఆయన అదుపులోకి తీసుకున్నట్లు సీఐడీ పోలీసులు తెలిపారు. వైద్యపరీక్షలు నిర్వహించి ఆయనను కాన్వాయ్‌లోనే ఎన్ఎస్‌జీ భద్రతతో విజయవాడకు తరలిస్తామని పేర్కొన్నారు.

## చంద్రబాబును ఎలాగైనా జైల్లో ఉంచాలనేదే జగన్ కుట్ర: బాలకృష్ణ

అమరావతి: తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఖండించారు. చంద్రబాబు అరెస్టు దుర్మార్గమన్నారు. ప్రజా సంక్షేమాన్ని జగన్ గాలికొదిలేసి.. ప్రతిపక్ష నేతలపై కక్షసాధింపులకే పరిమితమయ్యారని మండిపడ్డారు.



చంద్రబాబును ఎలాగైనా జైల్లో ఉంచాలనేదే సీఎం జగన్ కుట్ర అని దుయ్యబట్టారు. ఆధారాలు లేకుండా ఏ చట్టం ప్రకారం చంద్రబాబును అరెస్టు చేశారని నిలదీశారు. నిజంగా అవినీతి జరిగి ఉంటే ఇంతవరకు ఛార్జిషీట్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని బాలకృష్ణ స్పష్టం చేశారు. న్యాయపోరాటం చేసి ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటామన్నారు.




రాజోలు: తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిరసనకు దిగారు. చంద్రబాబును అరెస్ట్ చేస్తున్నారనే సమాచారంతో.. తొలుత కోనసీమ జిల్లా రాజోలు మండలం పొదలాడలో ఉన్న లోకేశ్ విజయవాడ బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఆయణ్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో రాజోలు సీఐ గోవిందరాజుతో లోకేశ్ వాగ్వాదానికి దిగారు.

ఏ విధమైన నోటీసు ఇవ్వకుండా ఎలా అడ్డుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "నా వెంట నాయకులు ఎవరూ రావడం లేదు. కుటుంబ సభ్యుడిగా నేను ఒక్కడినే వెళ్తున్నాను. అడ్డుకునే హక్కు మీకు ఎవరు ఇచ్చారు" అంటూ లోకేష్ నిలదీశారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా క్యాంప్ సైట్ వద్ద తన బస్సు ముందే బైఠాయించి లోకేశ్ నిరసన తెలిపారు. మరోవైపు మీడియాను కూడా లోకేశ్ బస చేసిన ప్రదేశానికి రానీయకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. లోకేష్ క్యాంప్ సైటులోకి నీరు, ఆహార పదార్థాలు రాకుండా అడ్డుకుంటున్నారు.

## న్యాయం గెలుస్తుంది.. చట్టాన్ని గౌరవిద్దాం: చంద్రబాబు

మంగళగిరి: ఉద్రిక్త పరిస్థితుల మధ్య తెదేపా అధినేత చంద్రబాబును నంద్యాల నుంచి విజయవాడ తీసుకొస్తున్నారు. ఈక్రమంలో దారి పొడవునా తెదేపా కార్యకర్తలు చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. ఈక్రమంలో మంగళగిరి సమీపంలో జాతీయ రహదారిపై తెదేపా శ్రేణులు టైర్లు తగులబెట్టి నిరసన తెలిపారు. దీంతో కాజ టోల్‌గేట్ వద్ద చంద్రబాబు కాన్వాయ్ నిలిచిపోయింది. పోలీసుల లాఠీ ఛార్జిని లెక్క చేయకుండా కార్యకర్తలు పెద్ద ఎత్తున మోహరించారు. ఈక్రమంలో చంద్రబాబు జోక్యం చేసుకుని కార్యకర్తలకు సర్దిచెప్పారు. సంయమనం పాటించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. న్యాయం గెలుస్తుంది.. చట్టాన్ని గౌరవిద్దామని కార్యకర్తలను కోరారు. చంద్రబాబు విజ్ఞప్తి చేయడంతో కార్యకర్తలు వెనక్కి తగ్గారు. దీంతో వాహన శ్రేణి ముందుకు కదిలింది. గుంటూరు నుంచి వేలాది మంది తెదేపా కార్యకర్తలు ద్విచక్రవాహనాలు, కార్లలో చంద్రబాబు కాన్వాయ్‌ను అనుసరిస్తున్నారు.

**చిలకలూరిపేటలోనూ ఇదే పరిస్థితి..** అంతకు ముందు చిలకలూరిపేట వద్ద జాతీయ రహదారిపై తెదేపా నేతల రాస్తారోకోతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో వేలాదిగా



ప్రజలు తరలిరాగా.. జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున మహిళలు బైఠాయించారు. దీంతో చంద్రబాబును తరలిస్తున్న వాహన శ్రేణి అరగంట పాటు నిలిచిపోయింది. స్పందించిన చంద్రబాబు వెంటనే వాహనం దిగివచ్చి దారి ఇవ్వాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ.. తొలుత కార్యకర్తలు పట్టువీడలేదు. దీంతో కాన్వాయ్ అక్కడే నిలిచిపోయింది. కాసేపటి తర్వాత చంద్రబాబు మరోసారి విజ్ఞప్తి చేయడంతో కార్యకర్తలు శాంతించారు. దీంతో కాన్వాయ్ అక్కడి నుంచి ముందుకు కదిలింది.




**తెలుగుదేశం అధినేత చంద్రబాబు అరెస్టును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఖండించారు. ఏదైనా ఉంటే పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చి చర్యలు చేపట్టాలని సూచించారు. కానీ పోలీసులు అర్ధరాత్రి వెళ్లి హంగామా సృష్టించాల్సిన అవసరమేమొచ్చిందని ప్రశ్నించారు. లోకేశ్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా తెదేపా నేతలను నిర్బంధించటం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. ఈ చర్య సీఎం జగన్‌కే రివర్స్ అవుతుందని.. చంద్రబాబుకు ఏమీ కాదని ఆయన అన్నారు.**

## శ్రీ ముఖి అందాల చెకుముకి.. ఇంత హాటా?

చక్కనమ్మ చిక్కిన అందమే అన్నది ఒకప్పటి ట్రెండ్... ఇప్పుడు బొద్దుగా ఉన్నా కూడా అభిమానులు ముద్దు చేస్తూనే ఉన్నారు. అసలు విషయం ఏమిటంటే... తెలుగు బుల్లితెర యాంకర్ గా ఒక రేంజ్ లో దూసుకుపోతున్న శ్రీముఖి అడపాదడపా హాట్ ఫోటోషూట్లు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ వస్తోంది. ఒకప్పుడు సినీ రంగ ప్రవేశం చేసి ఏకంగా అల్లు అర్జున్ లాంటి స్టార్ కు చెల్లెలి పాత్రలో నటించిన ఈమెకు ఎందుకు ఆశించిన మేర సినిమా అవకాశాలు మాత్రం రాలేదు. చిన్నచిన్న అవకాశాలు వస్తున్నా కాదనకుండా చేసుకుంటూ వెళుతోంది. కానీ హీరోయిన్ రేంజ్ అందం ఉన్న ఒకటి రెండు సినిమాలు అవి కూడా ఒక రకమైన బీ గ్రేడ్ తరహా సినిమాలు తప్ప ఆమెకు మంచి కథ కథనం ఉన్న సినిమాలు దొరకలేదు. అయితే బుల్లితెర మీద యాంకరింగ్ అవకాశాలు గట్టిగానే వస్తూ ఉండటంతో ఒకపక్క సినిమా ప్రయత్నాలు చేస్తూనే మరో పక్క



బుల్లితెర మీద కూడా యాంకర్ గా తన ప్రయత్నం తాను చేసుకుంటూ పోతుంది. అయితే ఈ మధ్యకాలంలో ఆమె ఎందుకో కానీ ఎక్కువగా హాట్ షో చేస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అందుకు ఊతమిచ్చే విధంగా ఆమె చేస్తున్న హాట్ ఫోటోషూట్లు సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు వైరల్ అవుతూనే వస్తున్నాయి. ఇక తాజాగా శ్రీముఖి ఎద అందాల మొత్తం బహిర్గతం అయ్యేలా చేసిన ఫోటోషూట్ అయితే సోషల్ మీడియాలో కలకలం రేపుతోందని చెప్పక తప్పదు. ఆమె అభిమానులందరూ ఇంత హాటుగా దర్శనం ఇవ్వడం అవసరమా అంటుంటే కుర్ర కారు మాత్రం ఆమె అందాలను జుర్రేసుకునేలోపడ్డారు. తాజాగా ఆమె ఇంత హాట్ సమ్మర్ లో ఇంకా హిట్ పెంచేస్తోంది అంటూ ఆమె ఫోటోషూట్ మీద కామెంట్ల వర్షం కురుస్తోంది. ఇక ఈ భామ మెగాస్టార్ చిరంజీవి హీరోగా మహేర్ రమేష్ డైరెక్షన్లో రూపొందుతున్న భోళాశంకర్ సినిమాలో ఒక కీలక పాత్రలో నటిస్తోందని అందులో ఖుషి సీన్ రీ క్రియేట్ చేస్తున్నారని కూడా చెబుతున్నారు. ఆ సినిమా అయినా ఆమెకు అవకాశాలు తెచ్చి పెట్టేలా చేస్తుందేమో చూడాలి

## బేబమ్మ ఒక మంచి నిర్ణయం..!

ఉప్పెన సినిమాతో బేబమ్మగా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న బెంగుళూరు భామ కృతి శెట్టి మొదటి సినిమా హిట్ పడే సరికి వరుస ఆఫర్లు వచ్చాయి. ఆ టైం లో కథ గురించి పెద్దగా పట్టించుకోకుండానే సినిమాలు సైన్ చేసింది అమ్మడు. ఉప్పెన తర్వాత శ్యాం సింగ రాయ్ బంగార్రాజు రెండు హిట్లు పడ్డాయి. హ్యాట్రిక్ హిట్స్ తో సూపర్ ఫామ్ లో ఉంది అనుకున్న టైం లోనే ఆ వెంటనే హ్యాట్రిక్ ఫ్లాపులు పడ్డాయి. రామ్ తో ది వారియర్ సుధీర్ బాబుతో ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి నితిన్ మాచర్ల నియోజకవర్గం ఈ 3 సినిమాలు కృతి శెట్టికి పెద్ద షాక్ ఇచ్చాయి. అందుకే ఇక మీదట కథల విషయంలో చాలా కేర్ ఫుల్ గా ఉండాలని అనుకుంటుంది కృతి. అంతేకాదు స్టార్ డైరెక్టర్ స్టార్ హీరో కాలిక్యులేషన్స్ కూడా వేసుకుంటుందని తెలుస్తుంది. మ్యాగ్జిమం లవ్ స్టోరీస్ కు మాత్రమే ప్రిఫరెన్స్ ఇస్తుందట. కమర్షియల్ సినిమాల్లో కూడా తన పాత్రకు వెయిట్ ఉంటేనే సినిమాకు ఓకే చెప్పాలని



అనుకుంటుందట. కృతి శెట్టి నిర్ణయం వెనుక తన ఫ్లాపులే కాదు కెరీర్ రిస్క్ లో పడితే ఛాన్స్ లు వస్తాయో రావో అన్న ఆలోచన కూడా ఉందని తెలుస్తుంది. వరుసగా హిట్లు కొట్టినప్పుడు కన్నా ఫ్లాపులు పడినప్పుడే కెరీర్ మీద భయం ఏర్పడుతుంది. 3 ఫ్లాపుల అనంతరం అమ్మడు తన ఆలోచనని మార్చుకుంది. కథలో విషయం ఉంటేనే సినిమా ఓకే చేయాలని నిర్ణయించుకుంది. ప్రస్తుతం నాగ చైతన్య కస్టడీ సినిమాలోనే చేస్తున్న కృతి ఇప్పటివరకు ఇంకా ఏ తెలుగు సినిమాకు ఓకే చెప్పలేదు. అయితే ఈ మధ్యనే మళయాళ ఎంట్రీ కూడా ఇచ్చింది అమ్మడు. టోవినో థామస్ తో ఒక సినిమా చేస్తుంది. పీరియాడికల్ మూవీ గా వస్తున్న ఈ సినిమాలో కృతి పాత్ర అదిరిపోతుందని అంటున్నారు. కృతి శెట్టి ఇలా వెంట వెంట సినిమాలు చేయకపోవడం కథల విషయంలో జాగ్రత్త పడటం మంచిదే కానీ మరీ గ్యాప్ ఎక్కువైతే ఆడియన్స్ మర్చిపోయే ఛాన్స్ కూడా ఉంది. వరుస వెంట సినిమాలు చేయాలి కానీ అందులో తన పాత్ర బాగా ఉండేట్టు చూసుకుంటే బెటర్. మొత్తానికి కృతి శెట్టి తిరిగి మళ్లీ ఫాం లోకి రావాలని విశ్వప్రయత్నాలు చేస్తుంది. అమ్మడి ఖాతాలో అర్జెంట్ హిట్ పడే వరకు టెన్షన్ కొనసాగుతూనే ఉంటుందని చెప్పొచ్చు.




## మిషన్ రాణిగంజ్ టీజర్: రెస్క్యూ ఆపరేషన్ మైండ్ బ్లోయింగ్




ఖిలాడీ అక్షయ్ కుమార్ కి సరైన పాన్ ఇండియా హిట్ సాధించడం ఎలానో ఓ పట్టాన అంతు చిక్కడం లేదు. ఇలాంటి సమయంలో అతడు వైవిధ్యమైన కంటెంట్ తో ఒక ప్రయత్నం చేస్తుండడం ఆసక్తిని పెంచుతోంది. ఈసారి అతడు నటిస్తున్న చిత్రం ఒక ఇంట్రెస్టింగ్ మిషన్ నేపథ్యంలో సాగనుంది. మిషన్ రాణిగంజ్: ది గ్రేట్ భారత్ రెస్క్యూ అనేది ఈ సినిమా టైటిల్. టైటిల్ కి తగ్గట్టే తాజాగా చిత్రబృందం ప్రభావవంతమైన టీజర్‌ను విడుదల చేసింది. ఇది అసాధారణం అద్భుతం అని పొగిడేయలేం .. కొత్తదనం నిండిన కథాంశం కూడా కాదు. ఈ తరహాలో గతంలో చాలా హాలీవుడ్ సినిమాలు వచ్చాయి. భారతీయ పరిశ్రమల్లోను ఇలాంటి సినిమాలు తెరకెక్కాయి. రెస్క్యూ ఆపరేషన్ నేపథ్యంలో ఇది మరో సినిమా అని మాత్రమే భావించాలి. కానీ ఖిలాడీ అక్షయ్ కుమార్ ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ అనడంలో సందేహం లేదు.    ఈ చిత్రం రాణిగంజ్ కోల్‌ఫీల్డ్‌లో జరిగిన ఒక నిజ జీవిత సంఘటన ఆధారంగా తెరకెక్కుతోంది. భారత్ కి చెందిన బొగ్గు గని రెస్క్యూ మిషన్‌కు నాయకత్వం వహించిన దివంగత శ్రీ జస్వంత్ సింగ్ గిల్ వీరోచిత పోరాటం నుండి ప్రేరణ పొంది రూపొందిస్తున్న చిత్రమిది. 1989 నవంబర్‌లో రాణిగంజ్‌లోని వరదల్లో బొగ్గు గనిలో చిక్కుకుని బతికి ఉన్న మైనర్లందరినీ రక్షించడంలో వీర జస్వంత్ సింగ్ గిల్ (అక్షయ్ కుమార్ ఈ పాత్రను పోషించాడు) ముఖ్యమైన పాత్ర పోషించాడు. ఇది అన్ని అసమానతలకు వ్యతిరేకంగా ప్రపంచంలోనే అతిపెద్ద విజయవంతమైన రెస్క్యూ మిషన్‌గా చరిత్రకెక్కింది. ఇది సాధించలేనిదిగా అనిపించిన భారీ మిషన్.. కానీ సాధించి చూపిస్తారు. మిషన్ రాణీగంజ్ టీజర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఆకట్టుకుంది. సస్పెన్స్, థ్రిల్స్.. డేర్ డెవిల్ ఫీట్స్ తో ఈ సినిమా అద్భుతంగా ఉంటుందని టీజర్ భరోసానిచ్చింది. బొగ్గు గనిలో సవాళ్లను అధిగమించాలనే సంకల్పంతో కార్మికుల మనోధైర్యం టీజర్ లో ఎంతో ఆకట్టుకుంటోంది. అక్షయ్ హీరోచిత ప్రయత్నాలు ఉత్కంఠను కలిగిస్తున్నాయి. మిషన్ రాణిగంజ్ టీజర్ చాలా ఆసక్తిని పెంచింది. మిషన్ రాణిగంజ్‌తో సూపర్‌స్టార్ అక్షయ్ కుమార్ తన ఉత్తమ ప్రదర్శనను ఇస్తాడని ఈ టీజర్ వీక్షించిన ఫ్యాన్స్ భావిస్తున్నారు.

ఈ చిత్రం థ్రిల్లింగ్ టీజర్.. ఈ జానర్ అక్షయ్ కే చెందినదని నిరూపిస్తోంది. రెస్క్యూ ఆపరేషన్ నేపథ్యంలో అక్షయ్ నటించిన సినిమాలు అన్నివేళలా కచ్చితంగా హిట్ అయ్యాయి. టీజర్ ఇంపాక్ట్ చూస్తే ఈ సినిమా కూడా విజయం సాధిస్తుందని ధీమా పెరుగుతోంది. వాషు భగ్నాని, జాకీ భగ్నాని, దీప్శిఖా దేశ్‌ముఖ్ , అజయ్ కపూర్‌లు నిర్మించిన ఈ చిత్రానికి టిను సురేష్ దేశాయ్ దర్శకత్వం వహించారు. దేశాన్ని, ప్రపంచాన్ని కదిలించిన రాణీగంజ్ బొగ్గు గని ప్రమాదంలో జస్వంత్ సింగ్ గిల్ నేతృత్వంలోని రెస్క్యూ టీమ్ ఎలా స్పందించింది? ఎలాంటి సాహసాలు చేసింది? అన్నది తెరపైనే చూడాలి. 6 అక్టోబర్ 2023న ఈ సినిమాని థియేటర్లలో విడుదల చేయనున్నారు.

## బోటమ్ యాంగిల్ తో అషు అందాలు



బిగ్ బాస్ బ్యూటీ అషురెడ్డి హీరోయిన్స్ కు ఏమాత్రం తగ్గకుండా అందాల ఆరబోత చేస్తూ అదరగొట్టేస్తోంది. అందాల ఆరబోతతో హీరోయిన్స్ కే పోటీ అన్నట్లుగా నిలుస్తోంది. ఒకప్పుడు జూనియర్ సమంత అంటూ పేరు దక్కించుకున్న అషురెడ్డి బిగ్ బాస్ తో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ ను దక్కించుకుంది. టీవీ షో లు మరియు సోషల్ మీడియా ద్వారా అషు రెడ్డి పాపులారిటీ మరింత ఎక్కువ అయ్యింది. ఇక వర్మ కు నచ్చిన ముద్దుగుమ్మ అంటూ అషు రెడ్డి కి పేరు ఉంది. ఆ మధ్య వర్మ ఏకంగా ఈమె కాళ్లు ముద్దాడటం తో పెద్ద ఎత్తున చర్చ జరిగిన విషయం తెల్సిందే.  ఈ అమ్మడు రెగ్యులర్ గా తన హాట్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఉంది. అప్పుడు ఒకసారి టాప్ యాంగిల్ తో తన క్లీ వేజ్ షో తో మతి పోగొట్టిన అషు రెడ్డి ఈసారి బోటమ్ యాంగిల్ తో అషు తన అందాలను చూపిస్తోంది. థైస్ ను చూపిస్తూ నడుము అందంతో అషు రెచ్చగొడుతోంది. మొత్తానికి 360 డిగ్రీస్ లో అషు తన అందాలను చూపిస్తూ అలరిస్తుంది అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న అషు రెడ్డి ని వెండి తెరపై చూడాలి అనుకుంటున్నాం అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియా మరియు బుల్లి తెరపై మాత్రమే కాకుండా ఈమె అందాన్ని వెండి తెరపై ఎప్పుడు చూస్తామో మరి

## వింక్ బ్యూటీ కి పవన్ లక్కీ ఛార్మ్ అవుతాడా?

ఎంత క్రేజ్ వున్నా కానీ కొంత మందికి కమర్షియల్ సక్సెస్ ని సొంతం చేసుకోవాలంటే కాలం కలిసి రాదు. క్రేజీ ఆఫర్లు లభించినా.. కానీ అదృష్టం తలుపు తట్టకపోవడంతో సక్సెస్ ని సొంతం చేసుకోలేకపోతుంటారు. గత కొంత కాలంగా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోంది వింక్ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్. మలయాళంలో సంచలనం సృష్టించిన 'ఒరు ఆదార్ లవ్' మూవీతో హీరోయిన్ గా తెరంగేట్రం చేసింది. ఇందులోని ఓ సీన్ లో హీరోకు కన్ను కొడుతూ దేశ వ్యాప్తంగా వైరల్ అయిన ప్రియా ప్రకాష్ వారియర్ ఆ సినిమా తరువాత భారీ క్రేజ్ ని అయితే దక్కించుకుంది. కానీ ఆ స్థాయిలో మాత్రం సక్సెస్ లని సొంతం చేసుకోలేక కెరీర్ విషయంలో సతమతమవుతోంది. 'ఒరు ఆదార్ లవ్' క్రేజ్ తో వింక్ బ్యూటీగా పేరు తెచ్చుకున్న ప్రియా ప్రకాష్ వారియర్ ఆ క్రేజ్ తో తెలుగులో రెండు సినిమాల్లో నటించే అవకాశాన్ని దక్కించుకుంది. నితిన్ తో కలిసి 'చెక్' మూవీతో పాటు తేజ సజ్జతో కలిసి 'ఇష్క్ : నాట్ ఏ లవ్



స్టోరీ'లోనూ నటించింది. అదృష్టం అవకాశాల రూపంలో తలుపు తట్టినా సక్సెస్ విషయంలో మాత్రం దురదృష్టం వెంటాడింది. దీంతో ఈ రెండు సినిమాలు ప్రియా ప్రకాష్ వారియర్ కు చేదు అనుభవాన్నే మిగిల్చాయి. ఆ తరువాత నుంచి మలయాళ హిందీ ఇండస్ట్రీల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడం మొదలు పెట్టింది. హిందీలో 'త్రీమంకీస్' యారియా 2 లవ్ హాకర్స్  శ్రీదేవి బంగ్లా వంటి సినిమాల్లో నటిస్తోంది. ఇందులో కొన్ని షూటింగ్ పూర్తి చేసుకుని రిలీజ్ కు రెడీ అయ్యాయి కూడా. అయితే ఎంత హిందీలో నటించినా కానీ ప్రియా ప్రకాష్ వారియర్ మైండ్ మొత్తం టాలీవుడ్ చుట్టే తిరుగుతోందట. ఎక్కడ సినిమా చేసినా టాలీవుడ్ లో నటించాలని ఇక్కడే పేరు తెచ్చుకోవాలని బలంగా కోరుకుంటోందట. తను ఆశించినట్టుగానే పవర్ స్టార్ రూపంలో ప్రియా ప్రకాష్ వారియర్ కు బంపర్ ఆఫర్ తగిలినట్టుగా తెలుస్తోంది. పవన్ కల్యాణ్ గాడ్ పాత్రలో సాయి ధరమ్ తేజ్ కీలక పాత్రలో నటిస్తున్న 'వినోదాయ సితం' రీమేక్ మంగళవారం మొదలైంది. సముద్రఖని దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో సాయి ధరమ్ తేజ్ కు జోడీగా కేతిక శర్మ నటించనుండగా కీలక పాత్రలో ప్రియా ప్రకాష్ వారియర్ కు చోటు దక్కిందట. ఈ సినిమా హిట్ అయితే టాలీవుడ్ లో  ప్రియా ప్రకాష్ వారియర్ దశ తిరిగినట్టేనని చెబుతున్నారు. అదే జరిగితే పవన్ కల్యాణ్ ..ప్రియా ప్రకాష్ వారియర్ కు లక్కీ ఛార్మ్ గా నిలవడం ఖాయం అని ఇన్ సైడ్ టాక్.

## ఐ లవ్ నాగచైతన్య.. గుట్టు విప్పిన 'మజిలీ' బ్యూటీ

అందానికి అందం అద్భుతమైన నటన .. గ్లామరస్ లుక్స్ తో మెప్పించే స్పీడ్ ఉన్న యంగ్ బ్యూటీ దివ్యాంశ కౌశిక్. నాగచైతన్య సరసన మజిలీ చిత్రంలో ఒక కథానాయికగా నటించి యువతరం మనసులు దోచింది. యువ క్రికెటర్ చైతో లవ్ లో తలమునకలుగా ఉండే టీనేజీ గాళ్ గా మంత్రముగ్ధులను చేసింది. తనదైన అందం నటనతో ఆకట్టుకుంది దివ్యాంశ. ఆ తర్వాత రవితేజ సరసన రామారావు ఆన్ డ్యూటీ చిత్రంలోను ఈ ఉత్తరాది బ్యూటీ నటించింది. కానీ ఫలితం ఆశించినంతగా రాలేదు. అయినా కెరీర్ పరంగా ఈ అమ్మడికి ఎలాంటి ఢోఖా లేదు. ప్రస్తుతం పలు తెలుగు చిత్రాలకు కమిట్ మెంట్లతో బిజీగా ఉంది. సందీప్ కిషన్- విజయ్ సేతుపతి నటిస్తున్న మైఖేల్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రంలో నటిస్తున్న దివ్యాంశ.. సుధీర్ వర్మ తెరకెక్కించనున్న తదుపరి చిత్రంలోను నటిస్తోందని



కథనాలొచ్చాయి. హిందీలోను ది వైఫ్ (2021) అనే చిత్రంలో దివ్యాంశ నటించింది. ఇక మజిలీ చిత్రీకరణ సమయంలో దివ్యాంశ తో ప్రేమాయణం సాగించడం వల్లనే సమంతతో నాగచైతన్య బ్రేకప్ అయ్యిందంటూ ఒక ప్రచారం అప్పట్లో సాగింది. బ్రేకప్ తర్వాత యువ ట్యాలెంట్ ని నాగచైతన్య పెళ్లాడేస్తున్నాడంటూ కొన్ని మీడియాల్లో కథనాలొచ్చాయి. తాజాగా వీటిపై దివ్యాంశను ప్రశ్నిస్తే ఆసక్తికర సమాధానం చెప్పింది. అవన్నీ రూమర్లు మాత్రమేనని ఖండించింది. అయితే ఐ లవ్ నాగచైతన్య... అతడు చాలా అందగాడు! తనపై క్రష్ ఉంది!! అంటూ మనసులో ఉన్న మాటను చెప్పేసింది. అయితే తనను ఒక సీనియర్ నటుడిగా గౌరవిస్తానని దివ్యాంశ హుందాతనం ప్రదర్శించింది. చైతన్యతో పెళ్లి పుకార్లను నేను వినలేదు. ఎవరి పనిలో వారు బిజీగా ఉన్నామని కూడా దివ్యాంశ అంది. మొత్తానికి అందగాడైన నాగచైతన్యపై తనకు క్రష్ ఉందని మాత్రం అంగీకరించింది. అయితే దివ్యాంశపై చైకి క్రష్ ఉందా లేదా? అనేది అభిమానుల ప్రశ్న! నాగచైతన్య క్రష్ అంతా స్టార్ డమ్ ని పెంచుకోవడంపైనే..! ప్రస్తుత పోటీప్రపంచంలో ఇది అంత సులువు కాదు.   ప్రస్తుతానికి సింగిల్ స్టాటస్ ని చైతన్య కంటిన్యూ చేస్తున్నాడు. గూఢచారి ఫేం శోభిత ధూళిపాలతో చైతన్య ఎఫైర్ వార్తలు వచ్చినా అవన్నీ నిరాధారమైనవని ప్రూవైంది.




# నేమ్‌ప్లేట్‌పై భారత్.. కోణార్క్ వీల్ గురించి బైడెన్‌కు వివరించిన మోదీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో జీ20 సమావేశాలు ఇవాళ ప్రారంభం అయ్యాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. భారత్ మండపంలో జరుగుతున్న కార్యక్రమానికి ఆయన తన టీమ్‌తో హాజరయ్యారు. ప్రధాని మోదీ ఆయనకు స్వాగతం పలికారు. భారత మండపంలో ఏర్పాటు చేసిన కోణార్క్ వీల్ వద్ద వివిధ దేశాధినేతలకు మోదీ షేక్ హ్యాండ్ ఇచ్చారు. బైడెన్ వచ్చిన సమయంలో కోణార్క్ వీల్ గురించి మోదీ వివరించారు. ఆ తర్వాత రౌండ్‌టేబుల్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. కొత్తగా జీ20లో సభ్యత్వం సాధించిన ఆఫ్రియా యూనియన్ అధినేతను ప్రధాని స్వాగతించారు. ఆయన్ను ఆలింగనం చేసుకుని కుర్చీలో కూర్చోపెట్టారు. మరో వైపు ప్రధాని మోదీ కూర్చున్న కుర్చీ వద్ద టేబుల్‌పై ఉండే దేశం నేమ్‌ప్లేట్‌పై భారత్ అని రాసి ఉంది.

గత కొన్ని రోజుల నుంచి దేశం పేరు మార్పు గురించి తీవ్ర స్థాయిలో చర్చ సాగుతున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు అంతర్జాతీయంగా భారత్‌ను ఇండియాగా గుర్తించే వారు. ఇప్పుడు తొలిసారి ఓ అంతర్జాతీయ సమావేశంలో ఇండియాను భారత్‌గా గుర్తిస్తూ.. రౌండ్‌టేబుల్‌పై దేశం నేమ్‌ప్లేట్‌ను ఏర్పాటు చేశారు. జీ20 ప్రతినిధులను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ ప్రసంగిస్తున్న చైర్ వద్ద ఉన్న నేమ్‌ప్లేట్‌లో భారత్ అని రాసి ఉంది. మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ.. భారత్ మిమ్మల్ని స్వాగతిస్తోందన్నారు.

# గొప్ప విజనరీ లీడర్ సీఎం కేసీఆర్..

## హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతాం: మంత్రి కేటీఆర్



హైదరాబాద్: హైదరాబాద్‌లో పెరుగుతున్న భూముల ధరలు, జరుగుతున్న అభివృద్ధి కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని ఐటీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఏ నగరమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే మౌలిక వసతుల మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సమష్టిగా, బ్యాలెన్సింగ్‌గా పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. హైదరాబాద్ హైటెక్స్?లో ఏర్పాటుచేసిన టైమ్స్ ఆఫ్ ఇండియా, టైమ్స్ మెగా ప్రాపర్టీ ఎక్స్ పో-2023ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సాగునీరు, తాగునీరు, వ్యవసాయ రంగం, పరిశ్రమలు, విద్యుత్.. ఇలా అన్ని రంగాలపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం ముందుచూపుతో దృష్టి సారించిందన్నారు. తెలంగాణ రాకముందు ఏడు వేల మెగావాట్ల విద్యుత్ ఉండేది, పవర్ హాలిడేస్‌తో పరిశ్రమలకు సెలవులు కూడా ఇచ్చే వాళ్లని చెప్పారు. జిరాక్స్ సెంటర్ నడవాలన్నా కరెంటు ఉండేదికాదన్నారు. కానీ, నేడు రాష్ట్రంలో 26 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉందని చెప్పారు. గతంలో తాగునీరుకు హైదరాబాద్ నగరంలో ఎప్పుడూ ఇబ్బంది ఉండేదని, సీఎం కేసీఆర్ దార్శనికతతో కృష్ణా, గోదావరి నదుల నుంచి వందల కిలోమీటర్లు నీళ్లు తీసుకువచ్చి నగరవాసులకు తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ఇటు కాళేశ్వరం, అటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 10 శాతం తాగు నీటిని అందిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌కు భవిష్యత్తులో తాగునీటి కొరత ఉండదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన ప్రతి ఒక్కరూ చెబుతూ ఉంటారని, సినీ హీరో రజినీకాంత్ లాంటి వాళ్ళు కూడా ఇది న్యూయార్కా లేక హైదరాబాదా అనే సందేహం వచ్చిందన్నారని గుర్తుచేశారు. విశ్వనగరంగా పోటీపడాలంటే మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వరకు మెట్రో టెండర్లు కూడా పూర్తయాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. నగరం చుట్టూ మెట్రో కనెక్టివిటీ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టిందని తెలిపారు. రాజధాని నగరానికి ఏ రంగంలో పెట్టుబడులు రావాలన్నా.. శాంతి భద్రతలు చక్కగా ఉండాలన్నారు. గతంలో ఏ పండుగొచ్చినా హైదరాబాద్‌లో వారం రోజుల పాటు కర్ఫ్యూ ఉండేదని, అయితే తెలంగాణ వచ్చిన తర్వాత అలాంటి పరిస్థితి ఇప్పటివరకు రాలేదని చెప్పారు. రియల్ ఎస్టేట్ రంగం హైదరాబాద్‌కే పరిమితం కాలేదు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పెరిగిందని వెల్లడించారు. మెట్రో రైలును విస్తరిస్తామని, మూసీ సుందరీకరణ చేస్తామన్నారు. గొప్ప విజనరీ లీడర్ మన కేసీఆర్ ఉన్నారని, హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. హైదరాబాద్ అంటే గచ్చిబౌలి, కొండాపూర్ అని కొంత మంది విమర్శిస్తున్నారని, న్యూయార్క్ లాంటి నగరాల్లో కూడా కొన్ని పాత పట్టణాలు ఉన్నాయని చెప్పారు. స్కై టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిచ్చిందని, గ్రీన్ బిల్డింగ్స్?ని ప్రోత్సహిస్తున్నదని వెల్లడించారు. డబ్బా బిల్డింగులే కాదు.. అట్రాక్టివ్?గా కూడా నిర్మాణాలు జరగాలని సూచించారు. హైదరాబాద్ పడమరవైపే కాకుండా మిగతావైపుల కూడా బిల్డర్లు అభివృద్ధి చేయాలన్నారు. అక్కడ కూడా ప్రభుత్వం పెద్ద ఎత్తున వసతులు కల్పించిందని, సౌత్, ఈస్ట్ హైదరాబాద్‌పై బిల్డర్లు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# యూరియా కొరత లేకుండా చూడండి.. సీఎంకు రేవంత్ బహిరంగ లేఖ

హైదరాబాద్: రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా చూడాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కొరత లేకుండా చూసేందుకు సీనియర్ అధికారులకు బాధ్యతలు అప్పగించాలన్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు రేవంత్ బహిరంగ లేఖ రాశారు. రైతులు అడిగినంత యూరియాను అందుబాటులో ఉంచాలన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి తెలంగాణలో రైతులు వాడే ఎరువులను వందకు వంద శాతం ఉచితంగా సరఫరా చేస్తామన్నారు. " 2017 ఏప్రిల్ 13న ప్రగతి భవన్ సాక్షిగా కేసీఆర్ రైతులకు ఇచ్చిన మాటకు దిక్కు లేకుండా పోయింది. ఆరు నూరు అవుతుందేమో కానీ.. మీరు మాట మీద నిలబడరని మరోసారి నిరూపితమైంది. ఉచిత ఎరువులని రైతుల చెవిలో మీరు పెట్టిన గులాబీ పూలు అలాగే ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎరువులు దొరక్క రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. సీఎం సొంత జిల్లాలోని తొగుట మండలంలోని రైతులు యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల పాటు తిరిగినా దొరకడం లేదని వాపోతున్నారు" అని రేవంత్ పేర్కొన్నారు.

**అభ్యర్థుల జాబితాలో మార్పులుంటాయని సీఎం కేసీఆర్ చెప్పారు**



**ముందస్తుగా ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో మార్పులు ఉంటాయని సీఎం కేసీఆర్ తనకు చెప్పినట్లు ఎమ్మెల్యే రాజయ్య వెల్లడించారు. అందుకే చివరి వరకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే రాజయ్యకు బీఫామ్ ఇవ్వాలని మహిళలు మద్దతు తెలుపుతూ నినాదాలు చేశారు. వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు.**

# పీఆర్ఎల్ఐను సందర్శించేందుకు వెళ్తున్నాం.. ధర్నాకు కాదు

మహబూబ్‌నగర్: పీఆర్ఎల్ఐ (పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం) సందర్శించడానికి వెళ్తున్నామని... ధర్నాకు.. రాస్తారోకోకు వెళ్లట్లేదని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. పీఆర్ఎల్ఐ పూర్తి చేశామని సీఎం కేసీఆర్.. మంత్రి నిరంజన్ రెడ్డి చెప్పారన్నారు. అయితే ఇది అవాస్తవం.. అది పూర్తి కాలేదని.. అందులో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఇప్పటికీ ఖర్చు చేసింది కేవలం 26 వేల కోట్ల రూపాయలని చెప్పుకొచ్చారు. ఇక పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటిని పొలాలకు వదులుతున్నమని చెప్పడం బోగస్ అన్నారు. 12 లక్షల ఎకరాలకు నిరందాలంటే 60 - 70 వేల కోట్ల ఖర్చు అవుతుందన్నారు. మరి మీరు ఇంకా టెండర్లు పిలవలేదని.. కాల్వలకు భూ సేకరణ జరగలేదని... పనులకు ప్లాన్ లేదు నీళ్ళు ఎట్లా వస్తాయని ప్రశ్నించారు. ఇంకా కేఎల్ఐలోనే లక్షా నలభై నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు రావాల్సి ఉందని లెక్కలే చెబుతున్నాయన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు 90 టీఎంసీల నీటికి కేంద్రం నుంచి అనుమతులు తేలేదన్నారు. మరి ఇది ప్రజలను మభ్య పెట్టేందుకు మాత్రమే అని ఆయన చెప్పుకొచ్చారు. వట్టెం నుంచి లక్ష ఎకరాలకు సాగు నీటికోసం ఇప్పుడు టెండర్లు పిలిచారన్నారు. ఆంధ్రా ప్రాంత కాంట్రాక్టర్ల లబ్ధి కోసం.. ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పంపుల కోసం రూ.2,400 కోట్లు ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇస్తే.. బీహెచ్ఈఎల్ ఇదే పంపులను కేవలం రూ.800 కోట్లకు ఇస్తున్నారన్నారు. అంటే కేవలం పంపులు మోటార్ల వల్లనే రూ1600 కోట్ల అవినీతి జరిగిందన్నారు. దీన్ని నిరుపిస్తానని.. లేదంటే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. తాను ఆరు సార్లు పోటీ చేసినా.. ఏనాడూ కానీ పనులకు హామీ ఇవ్వలేదని.. కేవలం నీతివంతమైన పాలన ఇస్తానని చెప్పానన్నారు. గూగుల్‌ను అడ్డుకుంటారా?.. గూగుల్ మ్యాప్‌లో తమ పతనం కనిపిస్తోందన్నారు. ఇదంతా కేవలం కాంగ్రెస్ బహిరంగ సభ ప్రాముఖ్యతను తగ్గించే కుట్ర అని ఆరోపించారు. ఈ సారి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధపడ్డారని జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.



# జాతీయ స్థాయి పరీక్షలో తెలంగాణ పోలీసుల ప్రతిభ.. ఏఎస్ఐలను సన్మానించిన డీజీపీ

హైదరాబాద్ : జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసులు మరోసారి తమ ప్రతిభను చాటారు. న్యూఢిల్లీలో ఎన్‌సీఆర్‌బీ, ఎంహెచ్ఏ ఆధ్వర్యంలో ఫింగర్ ప్రింట్ నిపుణుల కోసం జాతీయ స్థాయిలో పరీక్షలను నిర్వహించింది . ఈ పరీక్షల్లో టాప్ టెన్ ర్యాంకుల్లో తెలంగాణకు చెందిన 24 మంది ఏఎస్ఐలు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా శనివారం వారిని డీజీపీ అంజనీ కుమార్ సన్మానించి అభినందించారు. 24 మంది ఏఎస్ఐలు నాలుగుకోట్ల మంది తెలంగాణ ప్రజలు గర్వించేలా తమ ప్రతిభను చాటడం హర్షనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసులు శాంతి భద్రతలు, ఆధునిక టెక్నాలజీతో నేరాల అదుపు తదితర అంశాల్లో అద్భుతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఇటీవల టెన్నీస్, బ్యాడ్మింటర్, చెస్ పోటీల్లోనూ తెలంగాణ పోలీసులు జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమని అన్నారు. వేలిముద్ర నిపుణులు తమ విధి నిర్వహణలో ఎప్పటికప్పుడే నైపుణ్యాలను నేర్చుకొని పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు. సీఐడీ ఏడీజీపీ మహేశ్ భగవత్ డీజీపీ అంజనీకుమార్ నిరంతర ప్రోత్సాహం, మార్గదర్శకత్వం వల్లే పోలీసు శాఖకు గౌరవం దక్కుతుందని వెల్లడించారు.

# ఉద్యమమే ఊపిరిగా జీవించిన మహనీయుడు కాళోజీ : మంత్రి తలసాని



హైదరాబాద్ : ఉద్యమమే ఊపిరిగా జీవించిన మహనీయుడు, కవి కాళోజీ నారాయణ రావు అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో నిర్వహించిన కాళోజీ జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు.

కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ప్రజా కవిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా పని చేశారని చెప్పారు. 1992లో భారతదేశ అత్యున్నత పద్మ విభూషన్ పురస్కారాన్ని పొందారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం సెప్టెంబర్ 9 వ తేదీన కాళోజీ జయంతని అధికార భాషా దినోత్సవంగా నిర్వహిస్తూ ఆయన సేవలను స్మరించుకుంటూ గౌరవిస్తుందని పేర్కొన్నారు. కొందరు మరణించినా ప్రజల మనస్సులో ఎల్లప్పుడూ జీవించే వారు కొందరే ఉంటారని, అందులో కాళోజీ నారాయణ రావు ఒకరని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కాళోజీ స్మారక అవార్డు కు ఎంపికైన కవి జయరాజ్‌ను మంత్రి సన్మానించారు.

# నోడౌట్.. రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



మంగపేట(ములుగు): తెలంగాణలో త్వరలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ములుగు ఎమ్మెల్యే సీతక్క ధీమా వ్యక్తం చేశారు. ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం, మంగపేట, గంపోనిగూడెం గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి ఆధ్వర్యంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. కోమటిపల్లి క్రాస్‌రోడ్‌లో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. బీఆర్ఎస్‌పై ప్రజలకు భ్రమలు తొలగిపోయాయని, బీజేపీపై నమ్మకంలేదని, అందరు కాంగ్రెస్?కే ఈసారి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం కమలాపురం గుడ్డేలుగులపల్లి కాలనీలో సీతక్క పర్యటించగా, మహిళలు సాదరంగా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి సుమారు 50 మంది సీతక్క చేస్తున్న స్వచ్ఛంద కార్యక్రమాలకు ఆకర్శితులై, కాంగ్రెస్?లో చేరారు. మంగపేటలో టీవీ హిదయతుల్లా ఆధ్వర్యంలో పలువురు చేరారు. వారందరికీ సీతక్క కండువాలను మెడలో వేసి, స్వాగతం పలికారు. కార్యక్రమాలలో జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వల్లెపల్లి శివప్రసాద్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్‌బాబు, యూత్ కాంగ్రెస్ ములుగు నియోజికవర్గ ఇన్‌చార్జి ఇస్సార్‌ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య పాల్గొన్నారు.

# విమోచన దినోత్సవ వేడుకకు కేసీఆర్ రావాల్సిందే



హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని నిర్వహించకపోవడంపై తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "విమోచన దినోత్సవం జరపకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కేసీఆర్.. విమోచన దినోత్సవం జరపాలని గతంలో కాంగ్రెస్‌ను నిలదీసిన కేసీఆర్.. నేడు ఎందుకు విమోచన దినోత్సవం వేడుకలు నిర్వహించడం లేదు" అంటూ ప్రశ్నించారు. కేంద్రం అధీనంలో ఈ ఏడాది కూడా పరేడ్ గ్రౌండ్లో విమోచన దినోత్సవం వేడుకలు జరుగుతాయన్నారు. దీని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్.. ఆ రోజు రాజకీయ సభలకు ప్లాన్ చేసిందని విమర్శించారు. అమిత్ షా పాల్గొనే కార్యక్రమాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. సెప్టెంబరు 17 సాయంత్రం రాష్ట్రపతి భవన్లో తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకలు జరుగుతాయన్నారు. ఇది తెలంగాణ ప్రజలకు గర్వకారణమన్నారు. ఈ వేడుకలలో పోరాట యోధులకు నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుందన్నారు. మీరు మీటింగులు పెట్టుకుంటే మాకు అభ్యంతరం లేదు కానీ అదే రోజు ఎందుకు పెట్టుకున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్‌తో కుమ్మక్కై విమోచన దినోత్సవ వేడుకలను పక్కదారి పట్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది కేంద్ర అధీనంలో జరిగిన విమోచన దినోత్సవ వేడుకలకు రాకుండా దుమ్మా కొట్టిన కేసీఆర్.. ఈ ఏడాది కూడా కేసీఆర్‌కు విమోచన దినోత్సవం వేడుకలకు ఆహ్వానం పంపిస్తామన్నారు. సీఎం విమోచన దినోత్సవం వేడుకకు రావాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# పరిపాలనా సౌలభ్యం కోసమే పంచాయతీరాజ్ శాఖ పునర్ వ్యవస్థీకరణ : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, సెప్టెంబర్ 9 : తెలంగాణ రాష్ట్రం వచ్చాకే సీఎం కేసీఆర్ నేతృత్వంలో పంచాయతీరాజ్ శాఖను ప్రక్షాళన చేశామని ఆశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగం పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఖైరతాబాద్, ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన పీఆర్ డివిజనల్ కార్యాలయాలను మంత్రి ఎర్రబెల్లి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా 87 కొత్త కార్యాలయాలను ఏర్పాటు చేయగా సీఈ, సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాలలో నేడు సంబంధిత అధికారులు బాధ్యతలు తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో మొత్తం 237 ఇంజినీరింగ్ కార్యాలయాలు ఉండగా మిషన్ భగీరథతో పాటు ఇతర కార్యక్రమాల ద్వారా పంచాయతీరాజ్ కార్యకలాపాలు విస్తరించడంతో కొత్త కార్యాలయం ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. సీఎం కసీఆర్ ఆదేశాల మేరకు కొత్తగా నాలుగు చీఫ్ ఇంజినీరింగ్ కార్యాలయాలు, 12 కొత్త సర్కిల్, 11 డివిజన్లు, 60 కొత్త సబ్ డివిజన్లు, 4 రోజుల్లో అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే కొత్త కార్యాలయాల కోసం కింది స్థాయి అధికారులకు పదోన్నతులు కల్పించామని చెప్పారు. దీంతో ఏఈ స్థాయితో పాటు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మొత్తం 740 ఖాళీ అయ్యాయి అన్నారు. త్వరలోనే వీటిని భర్తీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, చీఫ్ ఇంజినీర్ సంజీవ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com